Follow: @ANNTELUGU
22-07-2026

# మహా పత్రిక

ANN తెలుగు

బుధవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 199 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



ఎఎన్ఎన్ మహా అవార్డ్స్ వేడుకకు

## సమాచార శాఖా మంత్రి పార్థసారథి

ఆహ్వానించిన సీఈవో కంది రామచంద్రారెడ్డి 02




టాప్ న్యూస్



## జీహెచ్ఎంసీ ఎన్నికలకు హైకోర్టు బ్రేక్

- వార్డుల డీలిమిటేషన్ పూర్తయ్యే వరకు నోటిఫికేషన్ వద్దన్న న్యాయస్థానం
- రాజకీయానికి విరామం

03



## నీట్ పేపర్ లీక్ జాతీయ సమస్య

- దోషులపై కఠిన చర్యలు తప్పవు: ప్రధాని మోదీ

03



## జాప్యం వద్దు

- కేకే కమిటీ కాలయాపన కమిటీ కాదని నిరూపించాలి.
- కల్వకుంట్ల కవిత.

03

అన్నోజీగూడలో అరాచకం... ఎపిసోడ్ 2

# అడ్డెవరు మనకు..!

## బాలరాజు గౌడ్ బరితెగింపు..!





- అన్నోజిగూడలో అల్లకల్లోలం..!
- రోడ్డును మింగిన అక్రమార్కుడు..!
- అక్రమాలను ప్రశ్నిస్తే 'మీ అంతు చూస్తా' అంటూ బెదిరింపులు..!
- మాజీ రౌడీషీటర్ కనుసన్నల్లోనే పోలీసులు ..?
- భయాందోళనలకు గురవతున్న స్థానికులు..!
- హైడ్రాకు చేరిన ఫిర్యాదులు..!
- మాకు రక్షణ కల్పించాలంటూ హైడ్రాను ఆశ్రయించన బాధితులు..!
- "ఫిర్యాదులపై విచారణ చేసి తగిన చర్యలు తీసుకుంటాం" – హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్...!

నిన్న మొన్నటి వరకు ప్రశాంతంగా, వివాదాలకు దూరంగా ఉన్న అన్నోజిగూడ పరిసర ప్రాంతాలు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డాయి . ఒకప్పుడు సాధారణ నివాస ప్రాంతంగా ఉన్న ఈ ప్రాంతంలో ప్రస్తుతం భూవివాదాలు, రోడ్ల ఆక్రమణలు, బౌన్సర్ల హల్ చల్, బెదిరింపులు, అధికార యంత్రాంగం స్పందనపై ప్రశ్నలు ఒకేసారి ఉత్పన్నం కావడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకరు కాదు, ఇద్దరు కాదు, ఏకంగా 30 మంది బౌన్సర్లను వెంటబెట్టుకుని మాజీ రౌడీషీటర్ బాలగోని బాలరాజు గౌడ్ తన ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తున్నాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. భూవివాదాల పేరుతో ప్లాట్ల యజమానులను భయభ్రాంతులకు గురిచేయడంతో పాటు, తమ హక్కుల గురించి ప్రశ్నించిన వారిని "మీ అంతు చూస్తా" అంటూ బెదిరించడం, ప్రజా వినియోగ రహదారులను సైతం కబ్జా చేయడం వంటి ఆరోపణలు ఇప్పుడు అన్నోజిగూడలో చర్చనీయాంశంగా మారాయి.దశాబ్దాలుగా ఎలాంటి వివాదాలు లేకుండా ఉన్న లేఅవుట్ లో ఒక్కసారిగా వివాదాలు తలెత్తడం వెనుక అసలు కారణాలేమిటి..? ప్రజల రాకపోకలకు ఉపయోగపడే రహదారులపై హక్కులు ఎవరు కల్పించారు..? లేఅవుట్ లోని రోడ్లకు సంబంధించిన భూములు ఎలా రిజిస్ట్రేషన్ అయ్యాయి..? అనే ప్రశ్నలు స్థానికుల నుండి ఉత్పన్నమవుతున్నాయి. మరోవైపు పలువురు బాధితులు పోలీసులను, రెవెన్యూ అధికారులను ఆశ్రయించినప్పటికీ ఆశించిన స్థాయిలో చర్యలు కనిపించలేదని ఆరోపిస్తున్నారు. దీంతో మాజీ రౌడీషీటర్ ప్రభావం ఇంకా కొనసాగుతోందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.వివాదం తీవ్రరూపం దాల్చడంతో బాధితులు హైడ్రాను ఆశ్రయించారు. రహదారుల ఆక్రమణలు, బెదిరింపుల వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి తమకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో అన్నోజిగూడ భూవివాదం ఇప్పుడు స్థానిక సమస్యను దాటి జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.ప్రజా రహదారులపై కన్నేసిన అక్రమార్కులపై అధికారులు ఉక్కుపాదం మోపుతారా..? లేక బాధితుల ఆవేదన కాగితాలకే పరిమితమవుతుందా..? అన్న ప్రశ్నలకు సమాధానం కోసం స్థానికులు ఎదురుచూస్తున్నారు.


2వ పేజీలో

# మోదీ దిగిపో!

## మోదీ ఇంటి ముందు మెరుపు ధర్నా

- ఢిల్లీలో హైటెన్షన్
- విద్యార్థులపై లాఠీఛార్జికి నిరసనగా భగ్గుమన్న కాంగ్రెస్
- రాహుల్‌ను బలవంతంగా ఎత్తుకెళ్ళిన పోలీసులు.. ముక్కుకు గాయం
- ప్రియాంక గాంధీని మెడపట్టి లాక్కెళ్లిన పోలీసులు
- దేశవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణుల నిరసనలు
- రాహుల్ అరెస్ట్ పై భగ్గుమన్న సీఎం రేవంత్ రెడ్డి..
- రోడ్డెక్కి ఆందోళన చేసిన కర్నాటక సీఎం డీకే





**ఢిల్లీ, మహా :** జాతీయ రాజధాని ఢిల్లీలో మోదీ సర్కార్ దమనకాండపై కాంగ్రెస్ అగ్రనేతలు భగ్గుమన్నారు. నీట్ పరీక్ష అక్రమాలను ప్రశ్నించిన అమాయక విద్యార్థులపై జరిగిన అమానుష లాఠీఛార్జికి నిరసనగా ప్రధాని నరేంద్ర మోదీ అధికారిక నివాసాన్ని కాంగ్రెస్ శ్రేణులు ముట్టడించాయి. మంగళవారం రాహుల్ గాంధీ నేతృత్వంలో అగ్రనేతలు ప్రియాంక గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్‌తో పాటు పలువురు సీనియర్ నేతలు లోక్ కల్యాణ్ మార్గ్‌లోని ప్రధాని ఇంటి ముందు మెరుపు ధర్నాకు దిగడంతో ఢిల్లీలో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. చేతులకు తాళ్లు కట్టుకుని మరీ నిరసన తెలుపుతూ.. విద్యార్థులపై దౌర్జన్యానికి నైతిక బాధ్యత వహిస్తూ "మోదీ తక్షణమే దిగిపోవాలి" అంటూ నినాదాలతో హోరెత్తించారు. మోదీ మౌనం వీడే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించుకుకూర్చున్నారు.

**రాహుల్ కు గాయం**

శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ప్రతిపక్ష నేతలపై మోదీ సర్కార్ పోలీసుల ద్వారా ఉక్కుపాదం మోపింది. ధర్నాను భగ్నం చేసే క్రమంలో పోలీసులు అత్యంత దారుణంగా, అమానుషంగా వ్యవహరించారు. ప్రజాస్వామ్య విలువలను మంటగలుపుతూ ఆందోళన చేస్తున్న రాహుల్ గాంధీని పోలీసులు బలవంతంగా ఎత్తుకెళ్లారు. ఈ పెనుగులాటలో రాహుల్ ముక్కుకు తీవ్ర గాయమైంది.

మిగతా 2వ పేజీలో

## రాహుల్‌ను అరెస్ట్ చేసిన కేంద్ర ప్రభుత్వ పతనం తప్పదు

కంది శ్రీనివాసరెడ్డి



**ఆదిలాబాద్, మహా :**నీట్ విద్యార్థుల హక్కులకై పోరాడుతున్న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అక్రమ అరెస్టును ఆదిలాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి తీవ్రంగా ఖండించారు. రాహుల్ గాంధీ ని అదుపులోకి తీసుకున్న విధానం కేంద్ర ప్రభుత్వ దిగజారుడుతనానికి పరాకాష్ట అన్నారు. దేశ వ్యాప్తంగా కోట్ల మంది విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిన నీట్ పరీక్ష సంక్షోభంపై, విద్యార్థుల హక్కుల కోసం

మిగతా 2వ పేజీలో




## సీతక్కపై క్రిమినల్ కేసు కొట్టివేసిన హైకోర్టు

**కింది కోర్టు ఉత్తర్వులు రద్దు**



**హైదరాబాద్, జూలై 21:** రాష్ట్ర మంత్రి, ములుగు ఎమ్మెల్యే దనసరి అనసూయ (సీతక్క)కు హైకోర్టులో ఊరట లభించింది. కొవిడ్ 19 మహమ్మారి సమయంలో ఆరోగ్యశ్రీ పథకం పరిధిలో కరోనా చికిత్సను చేర్చాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో నిర్వహించిన నిరాహార దీక్షకు సంబంధించి ఆమెపై నమోదైన క్రిమినల్ కేసును హైకోర్టు కొట్టివేసింది. ఈ కేసును హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజన మంగళవారం విచారించి, ఎక్సైజ్ కేసుల ప్రత్యేక జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు తీసుకున్న చర్యలను, కేసులో జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేస్తూ తీర్పు వెలువరించారు.

మిగతా 2వ పేజీలో

## కల్తీ పాల మాఫియా బాగోతం

- లీటరు పాలతో 50 లీటర్ల తయారీ!.
- ప్రమాదకర రసాయనాలతో పాల వ్యాపారం బట్టబయలు.

03





## తమ్మినేని సీతారాంకు హైకోర్టులో ఎదురుదెబ్బ

- క్వాష్ పిటిషన్ కొట్టివేత
- దర్యాప్తు ప్రాథమిక దశలోనే ఉందన్న న్యాయస్థానం

02



మహా పత్రిక
WWW.MAHAADAILY.COM
జనరల్ వార్తలు | GENERAL NEWS
బుధవారం, హైదరాబాద్ | 22-07-2026
ANN తెలుగు

# అడ్డెవరు మనకు..!

**మహా, స్టేట్ బ్యూరో చీఫ్ :** హైదరాబాద్ నగర శివార్లలో భూముల విలువలు అమాంతం పెరుగుతుండటంతో భూ వివాదాలు, కబ్జాలు, అక్రమ రిజిస్ట్రేషన్లు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. తాజాగా మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా, ఘట్‌కేసర్ మండలం అన్నోజిగూడలో వెలుగుచూసిన వ్యవహారం స్థానికులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. దాదాపు నాలుగు దశాబ్దాల క్రితం గ్రామపంచాయతీ అనుమతితో అభివృద్ధి చేసి విక్రయించిన లేఅవుట్‌లోని 40 అడుగుల ప్రధాన రహదారిపైనే ఇప్పుడు వివాదం రాజుకోవడం కలకలం రేపుతోంది. ఒకవైపు రిజిస్ట్రేషన్ పత్రాలను అడ్డం పెట్టుకుని రహదారిపై హక్కులు చెలాయించే ప్రయత్నాలు జరుగుతుండగా, మరోవైపు 30 మంది బౌన్సర్లతో మాజీ రౌడీషీటర్ బాలగోని బాలరాజు గౌడ్ హల్‌చల్ చేయడం పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మార్చింది.

ప్రజా వినియోగంలో ఉన్న రహదారిని ఆక్రమించి తమ రాకపోకలకు ఆటంకం కలిగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తుండగా, అక్రమాలను ప్రశ్నించిన వారిపై బెదిరింపులు, ఒత్తిళ్లు పెరుగుతున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఈ వ్యవహారం పోలీసు, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలతో పాటు హైడ్రా దృష్టికీ చేరింది. నాలుగు దశాబ్దాలుగా వివాదరహితంగా ఉన్న లేఅవుట్‌లో ఒక్కసారిగా తలెత్తిన ఈ పరిణామాల వెనుక అసలు కథ ఏమిటి..? ప్రజా రహదారిపై వ్యక్తిగత హక్కులు ఎలా వచ్చాయి..? రహదారికి సంబంధించిన భూమి రిజిస్ట్రేషన్ ఎలా జరిగింది..? అనే ప్రశ్నలకు సమాధానాలు వెతికే ప్రయత్నమే ఈ ప్రత్యేక కథనం.

**1988లో లేఅవుట్ అభివృద్ధి..!**

అన్నోజిగూడ గ్రామపంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 92 లో సుమారు ఎకరాలు 720 గుంటల భూమికి సంబంధించి బాలగోని రాజయ్య, బాలగోని పెద్ద నర్సింహ, బాలగోని దశరథ, బాలగోని ఆంజనేయులు, బాలగోని శంకర్, బాలగోని రమేష్ అనే ఆరుగురు యజమానులు కలసి బాలగోని పెద్ద నర్సింహా గౌడ్ కి జీపీఏ నంబర్ 423/IV/1987 ద్వారా రిజిస్ట్రేషన్ చేసి లేఅవుట్‌ను అభివృద్ధి చేశారు. అనంతరం 1988లో గ్రామపంచాయతీ అనుమతితో 132కు పైగా ప్లాట్లు, పార్కు, 25 అడుగుల అంతర్గత రహదారులు, 40 అడుగుల ప్రధాన రహదారితో కూడిన లేఅవుట్‌ను రూపొందించి విక్రయించినట్లు అప్పటి సేల్ డీడ్లు స్పష్టం చేస్తున్నాయి.

హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారికి పక్కనే ఏర్పాటు చేసిన 40 అడుగుల రహదారి అప్పటి నుంచి స్థానిక ప్రజలు, లేఔట్ లోని ప్లాట్ల కొనుగోలుదారుల వినియోగంలో ఉంది.





**2018 రిజిస్ట్రేషన్లతో మొదలైన వివాదం..!**

దాదాపు 38 ఏళ్లుగా ఎలాంటి వివాదాలు లేకుండా ఉన్న ఈ లేఅవుట్‌లో 2018లో జరిగిన రెండు రిజిస్ట్రేషన్ల తర్వాత పరిస్థితి మారినట్లు స్థానికులు చెబుతున్నారు.

డాక్యుమెంట్ నెం.7023/2018 - 1,334 చదరపు గజాలు

డాక్యుమెంట్ నెం.7070/2018 - 1,000 చదరపు గజాలు

మొత్తం విస్తీర్ణం - 2,334 చదరపు గజాలు

రిజిస్ట్రేషన్ తేదీ - 02082018

ఈ పత్రాల ఆధారంగా బలరాజు గౌడ్ తన హక్కులను చాటుకునే ప్రయత్నం చేస్తున్నాడని స్థానికులు చెబుతున్నారు. అయితే 1988లోనే ప్లాట్లు, రహదారులు, పార్కులతో కూడిన లేఅవుట్‌గా విక్రయించిన తర్వాత మళ్లీ అదే లేఔట్లోని 40 ఫీట్ల ప్రధాన రహదారి రిజిస్ట్రేషన్లు ఎలా జరిగాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**అక్రమ లేఅవుట్‌లనే అస్త్రంగా మార్చుకున్న మాజీ రౌడీ షీటర్ బాలగోని బాలరాజు గౌడ్ ..?**

1988లో గ్రామపంచాయతీ ఆమోదంతో ఏర్పాటైన జి.పి. లేఅవుట్‌లో ప్రజా వినియోగానికి కేటాయించిన 40 అడుగుల రహదారినే లక్ష్యంగా చేసుకుని మాజీ రౌడీషీటర్ బాలగోని బాలరాజు గౌడ్ పావులు కదిపాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎలాగైనా ఈ ప్రధాన రహదారిని తన ఆధీనంలోకి తెచ్చుకోవాలనే ఉద్దేశంతో ప్లాట్ల యజమానులను, స్థానిక ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాడని చెబుతున్నారు. ఒకప్పుడు 40 అడుగుల వెడల్పుతో ఉన్న రహదారిని 25 అడుగులకు కుదించి, మిగిలిన విస్తీర్ణాన్ని తన పేరుపై అక్రమ మార్గంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని బాధితులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం పాత రికార్డుల్లో ప్రధాన రహదారిగా నమోదై ఉన్న స్థలాన్ని, నక్షాలో ఉన్న గ్రామ పంచాయతీ రోడ్లను కూడా కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఈ రహదారిని తన గుప్పిట్లో పెట్టుకుని చుట్టుపక్కల ఉన్న వ్యవసాయ భూములపై కూడా పరోక్ష ఆధిపత్యం సాధించాలనే ఉద్దేశంతోనే మొత్తం వ్యవహారం నడుస్తోందని స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రజా రహదారిని ఆక్రమించడమే కాకుండా, దానిని అడ్డుగా పెట్టుకుని పరిసర ప్రాంతాల భూములపై కూడా కన్నేసినట్లు ఆరోపణలు రావడం ఇప్పుడు అన్నోజిగూడలో తీవ్ర చర్చనీయాంశమైంది.







**రోడ్డును మింగిన అక్రమార్కుడు..?**

కొద్దిరోజుల క్రితం బాలరాజు గౌడ్ తన అనుచరులతో కలిసి వచ్చి 40 అడుగుల రహదారిలో సుమారు 15 అడుగుల మేర ఫెన్సింగ్ వేయడానికి ప్రయత్నించినట్లు స్థానికులు చెబుతున్నారు. దీనిని ప్లాట్ల యజమానులు అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దశాబ్దాలుగా ప్రజల వినియోగంలో ఉన్న రహదారిని క్రమంగా ఆక్రమించుకునే ప్రయత్నం జరుగుతోందని ఆరోపిస్తున్నారు.

**30 మంది బౌన్సర్లతో హల్‌చల్..!**


ప్రశాంతంగా ఉన్న అన్నోజిగూడ పరిసర ప్రాంతాల్లో బాలరాజు గౌడ్ ఏకంగా 30 మంది బౌన్సర్లను మోహరించాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. బౌన్సర్ల సంచారంతో మహిళలు, వృద్ధులు, ప్లాట్ల యజమానులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని చెబుతున్నారు. చట్టపరంగా పరిష్కరించాల్సిన అంశాన్ని బలప్రయోగంతో ప్రభావితం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**అక్రమాలను ప్రశ్నిస్తే 'మీ అంతు చూస్తా'..!**

రహదారి ఆక్రమణను ప్రశ్నించిన వారిని అసభ్య పదజాలంతో దూషించడమే కాకుండా ప్రాణహాని బెదిరింపులకు పాల్పడుతున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్రమాలను అడ్డుకునే ప్రయత్నం చేసిన వారిపై ఒత్తిళ్లు తీసుకొస్తూ భయానక వాతావరణం సృష్టిస్తున్నాడని చెబుతున్నారు.

**మాజీ రౌడీషీటర్ కనుసన్నల్లోనే పోలీసులు..?**

ఈ వ్యవహారంపై పలుమార్లు పోలీసులకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటి వరకు ఆశించిన స్థాయిలో చర్యలు కనిపించలేదని స్థానికులు వాపోతున్నారు.



హైడ్రా కంప్లైంట్

దీంతో మాజీ రౌడీషీటర్ ప్రభావం ఇప్పటికీ కొనసాగుతోందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**భయాందోళనల్లో స్థానికులు..!**

భూవివాదం పేరుతో కొనసాగుతున్న బెదిరింపులు, బౌన్సర్ల సంచారం, రహదారి ఆక్రమణ ప్రయత్నాలతో స్థానికులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఎప్పుడు ఏం జరుగుతుందోననే భయాందోళనలు నెలకొన్నాయి.

**హైడ్రాకు చేరిన ఫిర్యాదులు..!**

స్థానిక స్థాయిలో న్యాయం జరగడం లేదనే భావనతో బాధితులు హైడ్రాను ఆశ్రయించారు. 1988 నుంచి ప్రజల వినియోగంలో ఉన్న 40 అడుగుల రహదారిని ఆక్రమించుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని, డాక్యుమెంట్ నంబర్లు 7023/2018, 7070/2018 ఆధారంగా ప్రజా రహదారిపై హక్కులు చెలాయిస్తున్నారని, బౌన్సర్లతో భయానక వాతావరణం సృష్టిస్తున్నారని ఫిర్యాదులో వివరించారు. రహదారిని పరిరక్షించడంతో పాటు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

**మాకు రక్షణ కల్పించండి..!**

బాలరాజు గౌడ్, అతని అనుచరుల నుంచి తమ ప్రాణాలకు ముప్పు ఉందని స్థానికులు పోలీసు, హైడ్రా అధికారులను ఆశ్రయించారు. వివాదాస్పద ప్రాంతంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ప్రజలకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

**" విచారణ చేసి చర్యలు తీసుకుంటాం" – హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్**

అన్నోజిగూడ వ్యవహారం హైడ్రా కమిషనర్ ఏ.వీ. రంగనాథ్ కి ప్రజవాణి ద్వారా స్థానికులు, భాధితులు ఫిర్యాదు చేసారు. బాధితులు సమర్పించిన ఫిర్యాదులు, సంబంధిత పత్రాలను పరిశీలించిన అనంతరం క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి వాస్తవాలను నిర్ధారిస్తామని, అక్రమాలు జరిగినట్లు తేలితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చినట్లు భాధితులు తెలిపారు. ప్రజా రహదారులు, ప్రభుత్వ భూములు, సామూహిక వినియోగ స్థలాల ఆక్రమణ విషయంలో ఎలాంటి రాజీ ఉండదని ఇప్పటికే స్పష్టం చేసిన హైడ్రా, అన్నోజిగూడ వ్యవహారంపై కూడా త్వరలో చర్యలు చేపట్టే అవకాశముందని స్థానికులు భావిస్తున్నారు.



**నిజాలు నిగ్గు తేలాల్సిందే..!**

అన్నోజిగూడ గ్రామపంచాయతీ పరిధిలో 1988లో ఆమోదం పొందిన లేఅవుట్‌లో భాగమైన 40 అడుగుల ప్రధాన రహదారికి సంబంధించిన వివాదంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. డాక్యుమెంట్ నంబర్లు 7023/2018, 7070/2018 ద్వారా నమోదైన 2,334 గజాల రిజిస్ట్రేషన్లు, లేఅవుట్ నక్షాలు, గ్రామపంచాయతీ రికార్డులు, రెవెన్యూ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి చట్టబద్ధతపై స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు.

ప్రజల వినియోగంలో ఉన్న రహదారులను కాపాడటం, అక్రమ ఆక్రమణలను అడ్డుకోవడం, బెదిరింపులు మరియు బలప్రయోగ రాజకీయాలకు అడ్డుకట్ట వేయడం కోసం పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, రిజిస్ట్రేషన్ శాఖలతో పాటు హైడ్రా అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మాజీ రౌడీషీటర్ బలగోని బలరాజు గౌడ్, అతని అనుచరుల నుంచి తమకు రక్షణ కల్పించడంతో పాటు ప్రజా రహదారులపై జరిగినట్లు ఆరోపణలు వస్తున్న ఆక్రమణలను వెంటనే తొలగించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.అన్నోజిగూడలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సంబంధిత శాఖలు తక్షణమే జోక్యం చేసుకుని ప్రజల్లో నెలకొన్న భయాందోళనలను తొలగించాలని, లేఅవుట్‌లోని రహదారులు, సామూహిక వినియోగ స్థలాలను పరిరక్షిస్తూ చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలని స్థానిక ప్రజలు పోలీసు శాఖ, హైడ్రా, మున్సిపల్ మరియు రెవెన్యూ అధికారులను వేడుకుంటున్నారు.



# మోదీ దిగిపో!

**( మొదటి పేజీ తరువాయి )** మరోవైపు, కనీసం మహిళా నేత అని కూడా చూడకుండా పోలీసులు దారుణంగా ప్రవర్తించారు.

కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీని అత్యంత పాశవికంగామెడ పట్టి ఈడ్చుకెళ్లడం ప్రభుత్వ అరాచకానికి, అహంకారానికి అద్దం పడుతోంది. ఖర్గే, వేణుగోపాల్ సహా పలువురు సీనియర్లను అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు.

మేము పిరికివాళ్ళం కాదు: ప్రియాంక గాంధీ పోలీసుల దమనకాండ, మోదీ సర్కార్ తీరుపై ప్రియాంక గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "కేంద్ర ప్రభుత్వం పిరికిపంద చర్యలకు పాల్పడుతోంది. వారికి భయం పట్టుకుంది. మమ్మల్ని చూసి వాళ్లు వణికిపోతున్నారు. మేము వాళ్ల లాగా పిరికివాళ్లం కాదు.. ఎవరికీ భయపడే ప్రసక్తే లేదు" అని ఆమె గర్జించారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు కోసం రాహుల్ గాంధీ నాయకత్వంలో ప్రారంభమైన ఈ పోరాటాన్ని ఎవరూ ఆపలేరని, ఇది ముగింపు కాదని, కేంద్రం పతనానికి ఆరంభమని కాంగ్రెస్ ఎంపీ రణదీప్ సుర్జేవాలా హెచ్చరించారు.

**రగిలిన దేశం**

రాహుల్, ప్రియాంకలపై పోలీసుల దౌర్జన్యం, అగ్రనేతల అక్రమ అరెస్టుల వార్తలతో దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు అగ్గిమీద గుగ్గిలమవుతున్నాయి. ఢిల్లీ ఘటనకు నిరసనగా దేశ నలుమూలలా కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగారు. కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేస్తూ, మోదీ ప్రభుత్వ నియంతృత్వ వైఖరిని ఎండగడుతున్నారు. నీట్ కుంభకోణం, విద్యార్థులపై పోలీసుల దాడులకు వ్యతిరేకంగా ప్రారంభమైన ఈ ఉద్యమం దేశ వ్యాప్తంగా దావానలంలా వ్యాపిస్తోంది.

**సీఎం రేవంత్ ఆగ్రహం**

ఢిల్లీలో విద్యార్థులకు మద్దతు గా రాహుల్ గాంధీ చేసిన ఆందోళన దేశ భవిష్యత్తు కోసమేనని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాహుల్ గాంధీ అరెస్ట్ దారుణమన్నారు.



# రాహుల్ ను అరెస్ట్ చేసిన కేంద్ర ప్రభుత్వ పతనం తప్పదు

**( మొదటి పేజీ తరువాయి )**

శాంతియుతంగా నిరసన తెలుపుతున్న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ని అక్రమంగా అరెస్ట్ చేయడం తీవ్ర ఆందోళనకరం మరియు దుర్మార్గమైన చర్య అని ఆదిలాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి *కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. ఈ నిర్బంధం దేశంలో ప్రజాస్వామ్య ఉనికిపైనే అనేక తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ తన స్వంత లేదా రాజకీయ ప్రయోజనాల కోసం ఈ నిరసన చేపట్టలేదని, నీట్ పరీక్ష అక్రమాలపై జవాబుదారీతనాన్ని డిమాండ్ చేస్తూ, దేశ యువత భవిష్యత్తు కోసం సమాధానాలు కోరుతూ ఆయన విద్యార్థుల పక్షాన నిలిచారన్నారు. శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనకు నాయకత్వం వహిస్తున్న ప్రజా నాయకుడిని పోలీసులు అత్యంత కఠినంగా, దురుసుగా అదుపులోకి తీసుకోవడం చూస్తుంటే దేశంలో నియంతృత్వ పోకడలు స్పష్టమవుతున్నాయన్నారు. చట్టబద్ధమైన ప్రశ్నలు



అడుగుతున్న పౌరులపై ఒక ప్రజాస్వామ్య ప్రభుత్వం స్పందించే తీరు ఇది కాదని, .నీట్ పరీక్ష నిర్వహణలో జరిగిన వరుస వైఫల్యాలకు, పేపర్ లీకేజీలకు పూర్తి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలన్నారు. భారతదేశ యువత భవిష్యత్తు అంధకారంలో ఉన్నప్పుడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మౌనంగా ఉండటం సరికాదని, దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళనలకు ఆయన సమాధానం చెప్పి తీరాలన్నారు. .కోట్ల మంది జీవితాలను ప్రభావితం చేసే నీట్ సంక్షోభంపై పార్లమెంట్‌లో ఖచ్చితంగా సమగ్ర చర్చ జరగాలి. విద్యార్థుల గళాన్ని కేంద్ర ప్రభుత్వం విస్మరించలేదని, వారి భవిష్యత్తును రాజకీయ వెసులుబాటుగా భావిస్తే కాంగ్రెస్ పార్టీ ఊరుకోదని హెచ్చరించారు. భారత యువత భవిష్యత్తు కంటే ముఖ్యమైన అంశం దేశంలో మరొకటి లేదని స్పష్టం చేశారు.ప్రజాస్వామ్యానికి జవాబుదారీతనం ఎంతో అవసరమని, విద్యార్థులకు న్యాయం జరిగే వరకు, కేంద్ర ప్రభుత్వం దిగివచ్చే వరకు రాహుల్ గాంధీ గారి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ తరపున పోరాటాన్ని కొనసాగిస్తామని ఆదిలాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. రాహుల్ ను దుర్మార్గం గా అరెస్ట్ చేసిన కేంద్ర ప్రభుత్వ పతనం తప్పదన్నారు.

## నేడు ఓలా, ఉబర్, ర్యాపిడో డ్రైవర్ల సమ్మె.

**హైదరాబాద్, మహా:** తెలంగాణలో యాప్ ఆధారిత క్యాబ్, బైక్ ట్యాక్సీ సేవలు అందిస్తున్న ఓలా, ఉబర్, ర్యాపిడో డ్రైవర్లు బుధవారం రాష్ట్రవ్యాప్తంగా సమ్మెకు దిగనున్నారు. కార్మిక హక్కులు, సామాజిక భద్రత కల్పించాలని, తమ సమస్యలను ప్రభుత్వం, యాప్ సంస్థలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ ఆందోళన చేపడుతున్నట్లు డ్రైవర్ల సంఘాలు ప్రకటించాయి.యాప్ ఆధారిత రవాణా రంగంలో పనిచేస్తున్న డ్రైవర్లకు కనీస భద్రత, సంక్షేమ ప్రయోజనాలు, న్యాయమైన ఆదాయం కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. తమ సమస్యలపై ఇప్పటివరకు ప్రభుత్వం, సంబంధిత సంస్థల నుంచి సానుకూల స్పందన లభించలేదని డ్రైవర్ల సంఘాలు ఆరోపించాయి.ఈ డిమాండ్లపై తక్షణ చర్యలు తీసుకోకపోతే ఆగస్టు 8 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెకు దిగుతామని డ్రైవర్ల సంఘాలు హెచ్చరించాయి. ఈ ఉద్యమానికి మద్దతుగా ఫుడ్ డెలివరీ, క్విక్ కామర్స్ రంగాల్లో పనిచేస్తున్న స్విగ్గీ, జొమాటో, బ్లింకిట్, జెప్టో డెలివరీ భాగస్వాములు కూడా నిరసనలో పాల్గొనే అవకాశం ఉందని సమాచారం.

## ఎఎన్ఎన్ మహా అవార్డ్స వేడుకకు సమాచార శాఖా మంత్రి పార్థసారథి

**ఆహ్వానించిన సీఈవో కంది రామచంద్రారెడ్డి**

**విజయవాడ, మహా :** ఏఎన్ఎన్ మహా అవార్డ్స్ వేడుక ఆగస్టు 8న విజయవాడ లో గ్రాండ్ గా నిర్వహించనుండగా, ఈ వేడుక లో ముఖ్య అతిథిగా పాల్గొనాలని రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధిని ఎఎన్ఎన్ సీఈవో కంది రామచంద్రారెడ్డి ఆహ్వానించారు. విజయవాడ తాజ్ వివంటాలో జరగనున్న ఈ వేడుక ఏపీ చరిత్రలో ఒక మైలురాయి గా మిగిలిపోతుందన్నారు. నిస్పాక్షిక వార్తలు అందిస్తూ ఎఎన్ఎన్ ప్రజాదరణ చూరగొనడం అభినందనీయమన్నారు. మరో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర ను కూడా సీఈవో కంది రామచంద్రారెడ్డి కలిసి ఎఎన్ఎన్ అవార్డ్స్ వేడుకకు ఆహ్వానించారు. ఏప్రిల్ లో




హైదరాబాద్ లో వేడుక విజయవంతంగా నిర్వహించిన ఏఎన్ఎన్ ఇపుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించిన విజయవాడ వేడుకకు సన్నాహాలు చేస్తోంది. హెల్త్ కేర్, బిజినెస్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి, ఆయా సంస్థలకు అవార్డులు అందజేయనున్నారు

## తమ్మినేని సీతారాంకు హైకోర్టులో ఎదురుదెబ్బ

**క్వాష్ పిటిషన్ కొట్టివేత.**

**దర్యాప్తు ప్రాథమిక దశలోనే ఉందన్న న్యాయస్థానం**

**అమరావతి, మహా:** ఏపీ అసెంబ్లీ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు మంగళవారం తిరస్కరించింది. కేసు దర్యాప్తు ఇంకా ప్రాథమిక దశలోనే కొనసాగుతోందని పేర్కొన్న న్యాయస్థానం, ఈ దశలో జోక్యం చేసుకోవడం సముచితం కాదని స్పష్టం చేసింది.అరెస్టు భయం ఉంటే చట్టప్రకారం ముందస్తు బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని తమ్మినేనికి హైకోర్టు సూచించింది. అలాగే ఈ కేసుకు సంబంధించి కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించిన న్యాయస్థానం, తదుపరి విచారణను జూలై 29కు వాయిదా వేసింది.నకిలీ పత్రాలను ఉపయోగించి సుమారు రూ.4 కోట్ల విలువైన భూమిని తన కుమారుడి పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకున్నారనే ఆరోపణలపై తమ్మినేని సీతారాంపై కేసు నమోదైంది. ఈ వ్యవహారంపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తుండగా, కేసును రద్దు చేయాలని కోరుతూ ఆయన హైకోర్టును ఆశ్రయించారు.ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు, ప్రస్తుతం దర్యాప్తు ప్రారంభ దశలో ఉన్నందున కేసును ఈ దశలో కొట్టివేయడానికి అవకాశం లేదని స్పష్టం చేసింది. దర్యాప్తు ప్రక్రియ కొనసాగనివ్వాలని పేర్కొంటూ క్వాష్‌పిటిషన్‌ను తిరస్కరించింది.






# ఎల్‌నీనో కంటింజెన్సీ ప్లాన్ బుక్‌లెట్ ఆవిష్కరణ

**రైతులకు సబ్సిడీ విత్తనాల పంపిణీ చేసిన మంత్రులు**

**హన్మకొండ, మహా ;** 2026 వానాకాల పంట సీజన్‌కు సంబంధించి వ్యవసాయ శాఖ రూపొందించిన 'ఎల్‌నీనో కంటింజెన్సీ ప్లాన్-2026' బుక్‌లెట్ తో పాటు పంటల క్యాలెండర్లను రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, ప్రజాప్రతినిధులు సంయుక్తంగా ఆవిష్కరించారు.
అనంతరం వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లేలా ప్రోత్సహించేందుకు,సబ్సిడీపై అందుబాటులోకి తీసుకువచ్చిన కంది, పెసర విత్తనాల ప్యాకెట్లను హనుమకొండ జిల్లా హసన్‌పర్తి, ఎల్కతుర్తి, దామెర, భీమదేవరపల్లి మండలాలకు చెందిన రైతులకు మంత్రుల చేతుల మీదుగా వ్యవసాయ శాఖ అధికారులు పంపిణీ చేశారు. రైతులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టి నష్టాలను తగ్గించుకోవాలని ఈ సందర్భంగా మంత్రులు సూచించారు.

# జాప్యం వద్దు

- **కేకే కమిటీ కాలయాపన కమిటీ కాదని నిరూపించాలి.**
- **కల్వకుంట్ల కవిత.**

**హైదరాబాద్, మహా.** ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులకు న్యాయం చేయడంలో ఎలాంటి జాప్యం చేయవద్దని తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల గుర్తింపు కమిటీకి కల్వకుంట్ల కవిత సూచించారు. ఉద్యమకారులకు న్యాయం చేసేలా తాను రూపొందించిన సమగ్ర నివేదికను కమిటీకి అందజేసిన ఆమె, ఇతర రాష్ట్రాల్లో అమలులో ఉన్న విధానాలను అధ్యయనం చేసి తెలంగాణలో కూడా అమలు చేయాలని కోరారు. మంగళవారం ట్యాంక్‌బండ్ సమీపంలోని అమరజ్యోతి కార్యాలయంలో కె. కేశవరావు అధ్యక్షతన జరిగిన తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సమావేశంలో ఆమె పాల్గొని పలు కీలక సూచనలు చేశారు. స్వాతంత్ర్య సమరయోధులకు అమలవుతున్న 'స్వతంత్ర సైనిక్ సమ్మాన్' పథకం, హైదరాబాద్ విమోచన ఉద్యమానికి సంబంధించిన నిబంధనలను అధ్యయనం చేసి, వాటిలోని ప్రయోజనాలను తెలంగాణ ఉద్యమకారులకు కూడా వర్తింపజేసే అంశాన్ని పరిశీలించాలని కవిత సూచించారు. ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియలో చట్టబద్ధత పేరుతో కాలయాపన చేయకుండా త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవాలని కమిటీని కోరారు.
కేకే కమిటీ అంటే కాలయాపన కమిటీ అనే అభిప్రాయం ప్రజల్లో ఉందని, ఆ అభిప్రాయం తప్పని కమిటీ తన పనితీరుతో నిరూపించాలని ఆమె అన్నారు. ఉద్యమకారుల హక్కుల కోసం బీఆర్ఎస్‌లో అంతర్గతంగా పోరాడి రాజకీయంగా నష్టపోయిన వ్యక్తిని తానేనని గుర్తు చేశారు. తన సూచనలు, సలహాల ద్వారా ఉద్యమకారులకు కొంతైనా మేలు జరిగితే అదే తన జీవితానికి సార్థకత అని పేర్కొన్నారు.
తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి గౌరవించేందుకు ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేయడం స్వాగతించదగ్గ విషయమేనని కవిత అన్నారు. అయితే గత ప్రభుత్వంలో ఉద్యమకారులకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. 1969 తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారిని కూడా గుర్తింపు ప్రక్రియలో చేర్చాలని, ఉద్యమ సమయంలో జైలుకు వెళ్లిన వారు, ఎఫ్ఐఆర్‌లు, చార్జిషీట్లు నమోదైన వారు, పోలీసుల వేధింపులు ఎదుర్కొన్న వారు, ఆస్తి నష్టపోయిన వారు, శాశ్వత వైకల్యం పొందిన వారందరికీ గుర్తింపు కల్పించాలని కమిటీకి సూచించారు. ఉద్యమంలో పదేపదే లాఠీచార్జీలకు గురైన వారిని కూడా గుర్తించాలని, ఉద్యమంలో పాల్గొని ఉద్యోగాలు కోల్పోయిన వారికి ప్రభుత్వం సహాయం చేయాల్సిన అవసరం ఉందని కవిత పేర్కొన్నారు.కొందరు ఉద్యమకారుల డీలర్‌షిప్‌లు కూడా రద్దయ్యాయని గుర్తు చేస్తూ, అలాంటి వారందరి విషయంలో కమిటీ మానవతా దృక్పథంతో వ్యవహరించాలని కోరారు. ఉద్యమకారులు మరణించినట్లయితే వారి కుటుంబాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, ముందుగా భార్యకు, ఆమె లేకపోతే పిల్లలకు, తల్లిదండ్రులకు ప్రభుత్వ ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
ఏ సంక్షేమ పథకం తీసుకొచ్చినా అది స్కామ్‌గా మారకుండా పటిష్టమైన నిబంధనలు రూపొందించాలని కవిత సూచించారు. జార్ఖండ్‌లో ఉద్యమకారుల పిల్లలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో ఐదు శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నారని, అక్కడ శాశ్వత కమిటీ కూడా పనిచేస్తోందని తెలిపారు. అలాగే గోవా, దాద్రా నగర్ హవేలి, బిహార్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర రాష్ట్రాల్లో ఉద్యమకారులకు పెన్షన్ పథకాలు అమలులో ఉన్నాయని గుర్తు చేశారు. ఆ రాష్ట్రాల విధానాలను అధ్యయనం చేసి తెలంగాణలో కూడా అమలు చేసే అవకాశాలను పరిశీలించాలని కమిటీకి సూచించారు.
రూల్ పొజిషన్, చట్టపరమైన అంశాల పేరుతో సమయాన్ని వృథా చేయకుండా ఉద్యమకారులకు త్వరగా న్యాయం చేయాలని కవిత విజ్ఞప్తి చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో పోరాడిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు, గౌరవం, సంక్షేమం అందేలా కమిటీ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.కాగా, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను గుర్తించి వారికి ప్రభుత్వ ప్రయోజనాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి మాజీ ఎంపీ కె. కేశవరావును చైర్మన్‌గా నియమించింది. మంగళవారం జరిగిన సమావేశానికి ఉద్యమకారులతో పాటు జర్నలిస్టులు, వైద్యులు, న్యాయవాదులు తదితరులు హాజరయ్యారు.

# కల్తీ పాల మాఫియా బాగోతం.

- **లీటరు పాలతో 50 లీటర్ల తయారీ!.**
- **ప్రమాదకర రసాయనాలతో పాల వ్యాపారం బట్టబయలు.**

**మెదక్,మహా:** మెదక్ జిల్లాలో వెలుగుచూసిన కల్తీ పాల వ్యవహారం ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ప్రజల నిత్యావసరమైన పాలను కొందరు అక్రమార్కులు భారీ లాభాల కోసం విషపూరిత రసాయనాలతో కల్తీ చేస్తూ కోట్ల రూపాయల అక్రమ వ్యాపారానికి తెరలేపిన విషయం తాజాగా బయటపడింది. పాల ధరలు పెరగడం, డిమాండ్ అధికంగా ఉండటాన్ని అవకాశంగా మార్చుకున్న ముఠాలు స్వచ్ఛమైన పాలలో ప్రాణాంతక రసాయనాలు కలిపి అనేక రెట్లు పెంచి విక్రయిస్తున్న తీరు విస్మయానికి గురిచేస్తోంది. తాజాగా మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం రెడ్డిపల్లిలో పోలీసులు నిర్వహించిన దాడుల్లో ఈ కల్తీ పాల మాఫియా గుట్టురట్టైంది. దర్యాప్తులో బయటపడిన వివరాల ప్రకారం, ఒక లీటరు స్వచ్ఛమైన పాలలో రసాయనాలు, ఇతర పదార్థాలు కలిపి దాదాపు 50 లీటర్ల వరకు కల్తీ పాలను తయారు చేస్తున్నట్లు గుర్తించారు. గోవిందరాజ్‌పల్లి ప్రాంతంలో కొంతకాలంగా రహస్యంగా సాగుతున్న ఈ అక్రమ వ్యాపారంపై నిఘా పెట్టిన పోలీసులు దాడులు నిర్వహించి భారీ ఎత్తున యంత్రాలు, రసాయనాలు, ముడి సరుకును స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో పలువురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పాలతో పాటు నెయ్యిని కూడా కల్తీ చేసి హైదరాబాద్‌తో పాటు జంట నగరాలకు తరలించి విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. నర్సాపూర్, కౌడిపల్లి వంటి ప్రాంతాలు హైదరాబాద్‌కు సమీపంలో ఉండటంతో పాల సరఫరా కేంద్రాలుగా మారాయి. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని కొందరు వ్యక్తులు చిన్నచిన్న ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసి పాడి రైతుల నుంచి స్వచ్ఛమైన పాలను కొనుగోలు చేస్తున్నారు. అనంతరం వాటిలో ప్రమాదకర రసాయనాలు కలిపి చిక్కగా కనిపించేలా మార్చి ప్యాకింగ్ చేసి లేదా విడిగా విక్రయిస్తున్నారు. బయటకు చూస్తే సాధారణ పాలలా కనిపించినా, వాటిలో కలిపే రసాయనాలు వినియోగదారుల ఆరోగ్యానికి తీవ్ర ముప్పుగా మారుతున్నాయని అధికారులు చెబుతున్నారు. గతంలో పాలలో నీరు కలిపి మోసం చేసే ఘటనలు ఎక్కువగా ఉండేవి. అయితే ఇప్పుడు లాభాల కోసం మరింత ప్రమాదకర మార్గాలను ఎంచుకుంటున్నారు. పాలు చిక్కగా కనిపించేందుకు పిండి, యూరియా, పొద్దుతిరుగుడు నూనె వంటి పదార్థాలను కలపడంతో పాటు పాలు విరిగిపోకుండా ఉండేందుకు యాసిడ్ వంటి రసాయనాలను ఉపయోగిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. ఈ రసాయనాల వినియోగం వల్ల దీర్ఘకాలంలో కిడ్నీ, కాలేయం, జీర్ణాశయం వంటి కీలక అవయవాలపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. రెడ్డిపల్లిలో దాడి సందర్భంగా లభించిన పాలను పరిశీలించిన ఒక సబ్‌ఇన్‌స్పెక్టర్ చేతికి బొబ్బలు రావడం ఈ కల్తీ పాలలో ఉపయోగిస్తున్న రసాయనాల తీవ్రతను స్పష్టంగా తెలియజేసింది. రసాయనాలను నేరుగా చేతితో కాకుండా చెంచా లేదా అగ్గిపుల్ల సహాయంతో పాలలో కలుపుతున్నట్లు పోలీసులు గుర్తించారు. స్థానిక రైతుల నుంచి లీటరు రూ.60 చొప్పున కొనుగోలు చేసిన స్వచ్ఛమైన పాలతో దాదాపు 300 లీటర్ల వరకు కల్తీ పాలను తయారు చేసి, వాటిని ఎలాంటి వివరాలు లేని ప్యాకెట్లలో నింపి హైదరాబాద్ మార్కెట్‌కు తరలిస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. ఈ కల్తీ పాలను లీటరుకు రూ.100 వరకు విక్రయిస్తూ భారీగా అక్రమ లాభాలు ఆర్జిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఘటనతో పాల కల్తీ మాఫియా వ్యవస్థీకృతంగా పనిచేస్తున్న తీరుపై ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న ఇలాంటి ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. మరోవైపు పాల ప్రాసెసింగ్ కేంద్రాలు, ప్యాకింగ్ యూనిట్లపై రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించి కల్తీ పాల మాఫియాను పూర్తిగా అరికట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



# నీట్ పేపర్ లీక్ జాతీయ సమస్య.
# దోషులపై కఠిన చర్యలు తప్పవు: ప్రధాని మోదీ

ఢిల్లీ, మహా. : దేశవ్యాప్తంగా సంచలనం రేపిన నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తొలిసారిగా స్పందించారు. ప్రశ్నాపత్రాల లీకేజీ జాతీయ స్థాయిలో ఆందోళన కలిగించే అంశమని, దీనిని రాజకీయాలకు అతీతంగా చూడాలని స్పష్టం చేశారు. ఈ ఘటనలో బాధ్యులైన వారిపై అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించిన ప్రధాని, విద్యార్థుల భవిష్యత్తు విషయంలో కేంద్ర ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదని స్పష్టం చేశారు.ఢిల్లీలోని పార్లమెంట్ లైబ్రరీ భవనంలోని జీఎంసీ బాలయోగి ఆడిటోరియంలో 'మంగళ్ మిలన్' పేరుతో నిర్వహించిన ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేసినట్లు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. సమావేశంలో నీట్ పేపర్ లీక్, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టీఏలు), దేశ ఆర్థిక పురోగతి తదితర అంశాలపై విస్తృతంగా చర్చ జరిగినట్లు తెలిపారు.నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీని అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నామని ప్రధాని పేర్కొన్నట్లు రిజిజు చెప్పారు. ప్రభుత్వం విద్యార్థుల వెంటే నిలుస్తుందని, పేపర్ లీక్‌లకు పాల్పడిన వారిని చట్టపరంగా కఠినంగా శిక్షించేందుకు అవసరమైతే న్యాయ నిపుణుల సలహాలు కూడా తీసుకోవాలని సూచించినట్లు వెల్లడించారు. కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా తమ పరిధిలో జరిగే పరీక్షల అవకతవకలపై ఎలాంటి రాజీ లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రధాని స్పష్టం చేసినట్లు తెలిపారు. పార్లమెంట్‌లో నిర్మాణాత్మక చర్చలకు ప్రతిపక్షాలు సహకరించాలని ప్రధాని పిలుపునిచ్చినట్లు కిరణ్ రిజిజు పేర్కొన్నారు. రాజకీయ విభేదాలు సహజమే అయినప్పటికీ, దేశ భవిష్యత్తు, యువత సంక్షేమం వంటి అంశాల్లో అందరూ కలిసి పనిచేయాల్సిన బాధ్యత ఉందన్నారు. యువతను తప్పుదోవ పట్టించకుండా సరైన మార్గంలో నడిపించడం ప్రజాప్రతినిధులందరి బాధ్యత అని ప్రధాని సూచించినట్లు తెలిపారు. నీట్ పరీక్షలో అక్రమాలపై సమాచారం అందిన వెంటనే కేంద్ర ప్రభుత్వం వేగంగా స్పందించి చర్యలు ప్రారంభించిందని రిజిజు తెలిపారు. ఈ కేసులో ఇప్పటికే 13 మందిని అరెస్టు చేసి జైలుకు పంపినట్లు వెల్లడించారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ఎలాంటి జాప్యం లేకుండా రీఎగ్జామ్ నిర్వహించి, అనంతరం ఫలితాలను కూడా విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై కూడా ప్రధాని చర్చించినట్లు రిజిజు తెలిపారు. ఏ దేశంతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్నా రైతుల ప్రయోజనాలకు ఎలాంటి భంగం కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ప్రధాని హామీ ఇచ్చారని చెప్పారు. దేశ ప్రయోజనాలు, రైతుల సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని మోదీ స్పష్టం చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా కొత్తగా రాజ్యసభకు ఎన్నికైన సభ్యులను ప్రధాని అభినందించినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా, నీట్ పరీక్ష అవకతవకలు, పరీక్ష రద్దు అనంతరం విద్యార్థుల ఆత్మహత్యల ఘటనలపై ప్రధాని ఇంతకాలం స్పందించలేదంటూ ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని విపక్ష పార్టీలు డిమాండ్ చేస్తూ నిరసనలు కొనసాగిస్తున్నాయి.

# హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ సమావేశం

**పాల్గొన్న ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**

**భువనగిరి జూలై 21 మహా** భువనగిరి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మంగళవారం నిర్వహించిన హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ సమావేశంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆసుపత్రి అభివృద్ధి, రోగులకు అందుతున్న వైద్య సేవలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు.
ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, వైద్యులు మరియు సిబ్బంది అందుబాటు, అవసరమైన వైద్య పరికరాలు, ఔషధాల సరఫరా, పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యం, రోగులకు కల్పిస్తున్న వసతులు, భవిష్యత్ అభివృద్ధి పనులు తదితర అంశాలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. ప్రభుత్వ ఆసుపత్రిపై ప్రజలకు మరింత విశ్వాసం పెరిగేలా నాణ్యమైన, సకాలంలో వైద్య సే వలు అందించాలని ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి అవసరమైన నిధులు మంజూరు అయ్యేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే గారు తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ భాస్కర్ రావు , మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవి,వైస్ చైర్మన్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులు, హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సీతక్కపై క్రిమినల్ కేసు కొట్టివేసిన హైకోర్టు

**( మొదటి పేజీ తరువాయి )**

దీంతో సీసీ నెం.308/2024లో సీతక్కపై కొనసాగుతున్న క్రిమినల్ విచారణకు ముగింపు పలికింది.2021 ఏప్రిల్ 26న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద సీతక్కతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆరోగ్యశ్రీ పథకంలో కొవిడ్ చికిత్సను చేర్చాలని కోరుతూ నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పోలీసుల అనుమతి తీసుకోలేదని, కొవిడ్ నిబంధనలను ఉల్లంఘిస్తూ సామాజిక దూరం పాటించకుండా, మాస్కులు ధరించకుండా నిరసన చేపట్టారని ఆరోపిస్తూ గాంధీనగర్ పోలీసులు ఐపీసీ సెక్షన్లు 188, 269, 270తో పాటు విపత్తు నిర్వహణ చట్టంలోని సెక్షన్ 51(బి) కింద కేసు నమోదు చేశారు. అనంతరం దర్యాప్తు పూర్తి చేసి చార్జిషీట్ దాఖలు చేయగా, ఎక్సైజ్ కేసుల ప్రత్యేక జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు దానిని స్వీకరించి విచారణ కొనసాగిస్తోంది.ఈ నేపథ్యంలో సీతక్క హైకోర్టును ఆశ్రయించారు. తనపై నమోదు చేసిన కేసు చట్టబద్ధం కాదని, కేసు స్వీకరణ నుంచే న్యాయపరమైన లోపాలు ఉన్నాయని పిటిషన్‌లో వాదించారు. ఐపీసీ సెక్షన్ 188 కింద కేసు విచారణకు సంబంధిత ప్రజాసేవకుడు లేదా అతని పైఅధికారి నుంచి తప్పనిసరిగా లిఖితపూర్వక ఫిర్యాదు ఉండాల్సి ఉంటుందని, కానీ ఈ కేసులో కేవలం పోలీసుల ఎఫ్ఐఆర్, చార్జిషీట్ ఆధారంగానే కోర్టు విచారణ ప్రారంభించడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. అలాగే విపత్తు నిర్వహణ చట్టంలోని సెక్షన్ 51(బి) కింద కూడా అవసరమైన చట్టబద్ధమైన విధానాన్ని అనుసరించలేదని, సెక్షన్ 60 ప్రకారం అధికారం కలిగిన వ్యక్తి ఫిర్యాదు చేయకపోవడంతో విచారణ కొనసాగించడానికి అవకాశం లేదని వాదించారు. అంతేకాకుండా ఐపీసీ సెక్షన్లు 269, 270 వర్తించాలంటే నిందితుడి చర్యల వల్ల అంటువ్యాధి వ్యాపించే అవకాశం లేదా వ్యాప్తికి సంబంధించిన ప్రాథమిక ఆధారాలు ఉండాలని, కానీ తనపై అలాంటి ఆరోపణలు గానీ, ఆధారాలు గానీ లేవని సీతక్క తరఫు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. కేవలం శాంతియుత నిరసనలో పాల్గొన్నందుకు ఈ నేరాలు వర్తించవని, సుప్రీంకోర్టు, వివిధ హైకోర్టుల తీర్పులు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేశాయని వాదించారు.వాదనలు పరిశీలించిన జస్టిస్ సుజన, సీతక్కపై కొనసాగుతున్న క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను కొనసాగించడానికి చట్టపరమైన ఆధారం లేదని నిర్ధారిస్తూ, కింది కోర్టు ఉత్తర్వులను రద్దు చేసి కేసును కొట్టివేశారు.

# కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి

**సిఐటియు జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం**

**యాదగిరిగుట్ట జూలై 21 మహా** చలో పార్లమెంట్ సందర్భంగా ఢిల్లీలో విద్యార్థులపై విచక్షణారహితంగా దాడి చేయించిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని, ఈ దాడికి బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని సిఐటియు యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం డిమాండ్ చేశారు.ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన దమనకాండకు నిరసనగా సిఐటియు ఆల్ ఇండియా కమిటీ పిలుపు మేరకు మంగళవారం యాదగిరిగుట్ట పట్టణ కేంద్రంలో నల్ల బ్యానర్ తో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కల్లూరి మల్లేశం మాట్లాడుతూ భారత రాజ్యాంగానికి లోబడి శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై టియర్ గ్యాస్, వాటర్ క్యానన్లను ఉపయోగించి దాడి చేయడం, విద్యార్థినుల పట్ల అమానుషంగా ప్రవర్తిస్తూ బట్టలు చింపివేయడం అత్యంత హేయమైన చర్య అని ,దీనికి బాధ్యత వహిస్తూ దేశ ప్రధాని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీకు కు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకొని విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాల్సింది పోయి, వారిపై లాఠీచార్జ్ చేయించడం బిజెపి ప్రభుత్వ అహంకారపూరిత, నియంతృత్వ వైఖరికి నిదర్శనం అన్నారు.పేపర్ లీక్ వల్ల మనస్థాపానికి గురై చనిపోయిన విద్యార్థుల కుటుంబానికి కోటి రూపాయల నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.విద్యార్థులపై అణచివేత చర్యలను ఇప్పటికైనా విరమించుకోవాలని, ప్రజాస్వామ్యబద్ధంగా వారి సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకపోతే దేశ వ్యాప్తంగా ఆందోళనలను మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కన్వీనర్ సీస శ్రీను,స్థానిక నాయకులు చుక్కల వెంకట య్య, బండ శ్రీశైలం, నగేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు



# చిన్న చర్లపల్లిలో స్మశాన వాటికి పరిరక్షణ కోసం నిరసన దీక్ష

**కుషాయిగూడ, మహా :** చిన్నచర్లపల్లిలో నిర్మిస్తున్న స్మశాన వాటిక స్థలాన్ని హిందువులకు చెందే విధంగా కేటాయించాలని మాజీ ఎమ్మెల్యే న్ వీ ఎస్ ఎస్ ప్రభాకర్ అన్నారు. చిన్నచల్లపల్లిలో నిర్మిస్తున్న స్మశాన వాటిక స్థలంలో ముస్లిం క్రిస్టియన్లకు కాకుండా హిందువులకే కేటాయించాలని చిన్న చర్లపల్లి చౌరస్తాలో హిందూ స్మశాన వాటిక పరిరక్షణ కోసం నిరసన దీక్షను అన్ని పార్టీల నాయకులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ స్మశాన వాటికలో ఉన్న స్థలాన్ని హిందువులకు, క్రిస్టియన్లకు, ముస్లింలకు కేటాయించడం సరైనది కాదని, ఈ స్థలాన్ని హిందువులకు కేటాయించి ముస్లిం, క్రిస్టియన్లకు మరోచోట కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాడూరి శ్రీనివాస్, కే నర్సింగ్ రావు, డినాదం రుద్రగోని రాంచందర్ గౌడ్, పల్లె వెంకటరెడ్డి, జంగారెడ్డి, భూపాల్ రెడ్డి, కే బాలరాజ్, కే రవి, బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు సంధ్యా నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నాగార్జున నగర్‌లో ఎంఎంసీ కమిషనర్ తనిఖీ

**ఆక్రమణల తొలగింపు, సి&డి వ్యర్థాల నిర్వహణ, పారిశుద్ధ్యం, పచ్చదనంపై కీలక ఆదేశాలు.**

**కుషాయిగూడ , మహా :** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి కాప్రా సర్కిల్ పరిధిలోని నాగార్జున నగర్ కాలనీలో సమగ్ర క్షేత్రస్థాయి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్, రవీంద్ర సాగర్ డిప్యూటీ ఇంజినీర్, బాలకృష్ణ అసిస్టెంట్ ఇంజినీర్, టౌన్ ప్లానింగ్ అధికారులు, అర్బన్ బయోడైవర్సిటీ విభాగం అధికారులు, శానిటేషన్ సిబ్బంది, రామ్‌కీ, ఈపీటీఆర్ఐ ప్రతినిధులు పాల్గొన్నారు.తనిఖీలో భాగంగా కాలనీలోని రహదారులు, ప్లాంటర్ బాక్స్‌ల పరిస్థితిని పరిశీలించిన కమిషనర్ ఖాళీగా ఉన్న అన్ని ప్లాంటర్ బాక్స్‌లను గుర్తించి వెంటనే మొక్కలు నాటాలని ఆదేశించారు. మొక్కల సంరక్షణ, నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అర్బన్ బయోడైవర్సిటీ విభాగానికి సూచించారు. నగరంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు అందుబాటులో ఉన్న ప్రతి ప్లాంటర్ బాక్స్‌ను సమర్థంగా వినియోగించాలని పేర్కొన్నారు.రహదారులపై అక్రమంగా నిర్మించిన ర్యాంపులు, ఇతర ఆక్రమణలను వెంటనే తొలగించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే రోడ్లపై పేరుకుపోయిన నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలను తొలగించి అవసరమైన చోట భూభాగాన్ని పూడ్చేందుకు వినియోగించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. కొత్త నిర్మాణ పనులు చేపట్టే వారు తప్పనిసరిగా అధీకృత సి&డి వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్‌తో అనుసంధానం చేసుకుని వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించాలని స్పష్టం చేశారు. వాణిజ్య సంస్థలు తమ ట్రేడ్ లైసెన్సులను స్పష్టంగా ప్రదర్శించాలని, హాస్టళ్లు ట్రేడ్ లైసెన్స్‌తో పాటు అన్ని చట్టబద్ధ అనుమతులు, రికార్డులు కలిగి ఉండాలని సూచించారు. నిబంధనలు పాటించని సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.కాలనీలోని ఖాళీ స్థలాల యజమానులను గుర్తించి తమ స్థలాలను పరిశుభ్రంగా నిర్వహించేలా అవగాహన కల్పించాలని, చెత్త డంపింగ్‌ను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. నగర పరిశుభ్రత, పచ్చదనం, శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణ, నిబంధనల అమలులో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు పరిశుభ్రమైన, సురక్షితమైన పట్టణ వాతావరణాన్ని అందించాలని కమిషనర్ పేర్కొన్నారు.

# జీహెచ్‌ఎంసీ ఎన్నికలకు హైకోర్టు బ్రేక్.

- **వార్డుల డీలిమిటేషన్ పూర్తయ్యే వరకు నోటిఫికేషన్ వద్దన్న న్యాయస్థానం**
- **రాజకీయానికి విరామం**

**హైదరాబాద్, మహా :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) ఎన్నికల ప్రక్రియకు తెలంగాణ హైకోర్టు తాత్కాలికంగా బ్రేక్ వేయడంతో రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. వార్డుల పునర్విభజన (డీలిమిటేషన్) చట్టబద్ధంగా జరగలేదంటూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన హైకోర్టు, వార్డుల సరిహద్దులను నిబంధనల ప్రకారం ఖరారు చేసే వరకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణ వరకు ఎన్నికల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లవద్దని స్పష్టం చేయడంతో జీహెచ్‌ఎంసీ ఎన్నికల షెడ్యూల్ అనిశ్చితిలో పడింది.రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వార్డుల పునర్విభజన ప్రక్రియ చట్ట నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని ఆరోపిస్తూ పలువురు హైకోర్టును ఆశ్రయించారు. జీవో నంబర్ 570 ప్రకారం జనాభా ప్రాతిపదికన వార్డుల డీలిమిటేషన్ చేపట్టాలని, అలాగే మున్సిపల్ చట్టంలోని నిబంధనల మేరకు ప్రజల అభ్యంతరాలు, సూచనలను స్వీకరించి పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుందని పిటిషనర్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అయితే ప్రభుత్వం ఈ నిబంధనలను పాటించకుండా వార్డుల పునర్విభజన చేపట్టిందని వారు వాదించారు.ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు ప్రాథమిక అంశాలను పరిశీలించిన అనంతరం, చట్టబద్ధంగా వార్డుల సరిహద్దులను పునర్నిర్ణయించే వరకు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయరాదని ఆదేశించింది. తుది విచారణ పూర్తయ్యే వరకు ఎన్నికల ప్రక్రియను నిలిపివేయాలని స్పష్టం చేసింది. దీంతో జీహెచ్‌ఎంసీ ఎన్నికల నిర్వహణపై తాత్కాలిక సందిగ్ధత నెలకొంది.హైకోర్టు తాజా ఆదేశాలతో ఎన్నికల కోసం ఇప్పటికే వ్యూహాలు రచిస్తున్న రాజకీయ పార్టీల ప్రణాళికలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. జీహెచ్‌ఎంసీ పీఠాన్ని దక్కించుకునేందుకు అధికార కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్, బీజేపీ విస్తృతంగా సన్నాహాలు ప్రారంభించాయి. జనసేన కూడా పోటీ చేస్తామని ప్రకటించడంతో నగర రాజకీయాలు మరింత వేడెక్కాయి. ఈ నేపథ్యంలో హైకోర్టు ఆదేశాలు అన్ని పార్టీల ఎన్నికల కార్యాచరణపై ప్రభావం చూపనున్నాయి.
ఇక ప్రభుత్వం డీలిమిటేషన్ ప్రక్రియను ఏ విధంగా సమర్థించుకుంటుందన్నదే ఎన్నికల భవిష్యత్తును నిర్ణయించే కీలక అంశంగా మారింది. హైకోర్టు తుది తీర్పు వెలువడే వరకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం లేకపోవడంతో అన్ని రాజకీయ పార్టీలు తదుపరి న్యాయపరమైన పరిణామాలపై దృష్టి సారించాయి. న్యాయస్థానం తుది నిర్ణయం వెలువడిన తర్వాతే జీహెచ్‌ఎంసీ ఎన్నికల ప్రక్రియపై స్పష్టత వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి

# ఏపీలో యూఏఈ ఫుడ్ క్లస్టర్‌కు గ్రీన్‌సిగ్నల్

- **దావోస్ ఒప్పందం అమలు దిశగా కీలక ముందడుగు.**
- **సీఎం చంద్రబాబుతో యూఏఈ ప్రతినిధుల భేటీ..**

**అమరావతి, మహా :** దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సులో కుదిరిన కీలక ఒప్పందాల్లో మరోటి అమలు దశకు చేరుకుంది. ఆంధ్రప్రదేశ్‌లో ఫుడ్ క్లస్టర్ ఏర్పాటు చేసేందుకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ముందుకు రావడంతో రాష్ట్రంలో ఆహార శుద్ధి రంగానికి కొత్త ఊపు లభించనుంది. ఈ మేరకు యూఏఈ ఆర్థిక, పర్యాటక శాఖ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రీ నేతృత్వంలోని ప్రతినిధుల బృందం మంగళవారం అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని కలిసి ప్రాజెక్టుపై విస్తృతంగా చర్చించింది.
ఈ ఏడాది దావోస్ పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన ఆహ్వానానికి స్పందించిన యూఏఈ, ఆంధ్రప్రదేశ్‌లో ఫుడ్ క్లస్టర్ ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లలో మరింత విలువ చేకూర్చేలా ఆహార శుద్ధి రంగంలో సమగ్ర వాల్యూ చైన్‌ను అభివృద్ధి చేయాలని ఇరుపక్షాలు నిర్ణయించాయి.
ఈ భాగస్వామ్యం ద్వారా రాష్ట్రంలో పండే మామిడి, అరటి, కోకోతో పాటు ఇతర ఉద్యాన ఉత్పత్తులను శుద్ధి చేసి, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేసే వ్యవస్థను అభివృద్ధి చేయనున్నారు. దీంతో రైతులకు మెరుగైన గిట్టుబాటు ధరలు లభించడంతో పాటు, ఆహార శుద్ధి పరిశ్రమలకు పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు కూడా పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం-యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ మధ్య ఏర్పడిన ఈ భాగస్వామ్యం రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కీలకంగా మారుతుందని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది. సమావేశంలో మంత్రి టీజీ భరత్‌తో పాటు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ, పరిశ్రమల శాఖ, ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి మండలి (ఈడీబీ) ఉన్నతాధికారులు, యూఏఈ ప్రతినిధులు పాల్గొని ప్రాజెక్టు అమలు, పెట్టుబడులు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు.

ABN తెలుగు

# మహా పత్రిక

బుధవారం, హైదరాబాద్
22-07-2026

(మహా ప్రత్యేకం)

04



# ఢిల్లీ రణరంగం

## నిరసనలతో దద్దరిల్లిన హస్తిన

నీట్ పరీక్ష అక్రమాలపై విద్యార్థులకు సంఘీభావం ప్రకటిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ అధికారిక నివాసం ఎదుట కాంగ్రెస్ పార్టీ చేపట్టిన మెరుపు ధర్నా దేశ రాజధాని ఢిల్లీలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే సహా కాంగ్రెస్ అగ్రనేతలు చేతులకు తాళ్లు కట్టుకుని నిరసన వ్యక్తం చేయగా, వారిని పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకోవడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ సందర్భంగా జరిగిన పెనుగులాటలో రాహుల్ గాంధీకి గాయమవడం, ప్రియాంక గాంధీని పోలీసులు ఈడ్చుకెళ్లిన దృశ్యాలు రాజకీయ వర్గాల్లో తీవ్ర విమర్శలకు దారితీశాయి. ఢిల్లీ ఘటనతో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు రోడ్డెక్కి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు చేపట్టాయి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నుంచి కర్నాటక నాయకత్వం వరకు పలువురు కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ ఆందోళనల్లో పాల్గొన్నారు. ఒకవైపు విద్యార్థుల భవిష్యత్తు, మరోవైపు ప్రతిపక్ష నేతలపై పోలీసుల వ్యవహారశైలి దేశ రాజకీయాలను కుదిపేసింది. రాజధానిలో ఉద్రిక్తత, నిరసనల జ్వాలలు, పోలీసుల చర్యలు, కాంగ్రెస్ నాయకుల ఆగ్రహం వ్యక్తం చేశారు.























## వర్షా ల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- **ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టండి**
- **బల్దియా కమిషనర్ టి.వెంకన్న**

**వరంగల్, కార్పొరేషన్ మహా ;** విస్తృతంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని బల్దియా కమిషనర్ టి.వెంకన్న అధికారులను ఆదేశించారు. నగర పరిధి లోని లోతట్టు ప్రాంతాలైన తిరుమల బార్ జంక్షన్ ,ఎన్ జీ ఓస్ రోడ్డు, ఎస్ బి హెచ్ కాలనీ,రామకృష్ణ కాలనీ,కాకతీయ కాలనీ,బొంది వాగు, శివ నగర్, మైసయ్య నగర్ , సాయిగణేష్ నగర్ వడ్డేపల్లి చెరువు ,12 మోరీలు ప్రాంతాల్లో కమిషనర్ క్షేత్ర స్థాయి లో సందర్శించి సమర్థవంతంగా చేపట్టుటకు అధికారులకు తగు సూచనలు చేశారు.ఈ సందర్భం గా కమిషనర్ మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న ప్రస్తుత తరుణం లో నగరం లోని లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలవకుండా ఇంజనీరింగ్ కు చెందిన మాన్ సూన్ టీమ్స్ సహకారం తో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా వెంటనే తొలగించాలని చిన్న చిన్న గల్లీ లోని డ్రైన్ లో నీరు నిలిచి ఉండకుండా అవసరం మేరకు డీ సిల్టింగ్ ప్రక్రియ చేపట్టి నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని ప్రధాన రోడ్ల పై శానిటేషన్ పక్కా గా జరిగేలా చూడాలని సూచించారు. ముఖ్యంగా డివైడర్ ల మధ్యలో చెత్త, పిచ్చి మొక్కల ఆకులు పేరుకు పోకుండా తొలగించాలని వీటి తో పాటు లింక్ రోడ్ ల శుభ్రత పై దృష్టి సారించాలని స్వీపింగ్ మిషన్ లు మరమ్మత్తుల కు గురి కాకుండా చూడడం తో పాటు అట్టి మిషన్ పని తీరు పై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ పర్యటన లో కమిషనర్ వెంట ముఖ్య ఆరోగ్యాధికారి డాక్టర్ .రాజారెడ్డి,ఎం హెచ్ ఓ డా.రాజేష్,శానిటరీ సూపర్ వైజర్ గోల్కొండ శ్రీను తదితరులు ఉన్నారు.

# వైభవంగా బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణ మహోత్సవం





- **పాల్గొన్న మంత్రి కొండా సురేఖ**
- **అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి**

**వరంగల్, బ్యూరో మహా ;** హైదరాబాద్ లోని బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి ఆలయం లో నిర్వహించిన వార్షిక కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ తన కూతరు సుస్మితా పటేల్ తో కలిసి అమ్మవారికి సంప్రదాయ బద్ధంగా పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయానికి వచ్చిన మంత్రి కి దేవాలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికి, అమ్మవారి తీర్థప్రసాదాలు, వేద ఆశీర్వచనాలు అందించారు. అనంతరం తన కూతురితో కలిసి బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళ్యాణోత్సవానికి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సతీమణి గీతా రెడ్డి ని మంత్రి కొండా సురేఖ మర్యాదపూర్వకంగా కలుసుకుని బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, బల్కంపేట అమ్మవారి కళ్యాణోత్సవానికి లక్షలాదిగా భక్తులు తరలివచ్చి ప్రభుత్వం కట్టుదిట్టంగా చేసిన ఏర్పాట్ల మధ్య అమ్మవారిని సంతోషంగా దర్శించుకుంటున్నారని అన్నారు. పిల్లలు, వృద్ధులు, దివ్యాంగులు, శివసత్తులకు అమ్మవార్ల దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసిన విషయాన్ని మంత్రి సురేఖ గుర్తు చేశారు. తెలంగాణ ప్రజల ఆరాధ్య దైవమైన శ్రీ బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి వార్షిక కళ్యాణోత్సవంలో పాల్గొనడం ఎంతో ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించింది. నా కూతురు సుస్మితపటేల్ తో కలిసి, అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించడం నా అదృష్టంగా భావిస్తున్నాను" అని అన్నారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న వరుణ యాగాలు, ప్రత్యేక పూజలతో అమ్మవార్ల అనుగ్రహం లభించి తెలంగాణ పై వరుణ దేవుడు వర్షాలతో కరుణ చూపాలని మంత్రి కొండా సురేఖ కోరుకున్నారు. ఈ వర్షాలతో రాష్ట్రం పాడిపంటలతో సస్యశ్యామలంగా, సుభిక్షంగా వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు. అమ్మవారి ఆశీస్సులతో సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వ పాలనలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని, ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం వెల్లి విరియాలని మంత్రి కొండా సురేఖ అమ్మవారిని ప్రార్థించారు.

## ఇసుక ట్రాలీ ఢీకొని మూడేళ్ల చిన్నారి దుర్మరణం

**ఆలేరు జూలై 21 మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాకలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. మంగళవారం ఉదయం ఇంటి ముందు ఆడుకుంటున్న మూడేళ్ల చిన్నారిని ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాలీ ఢీకొనడంతో తీవ్ర గాయాలై మృతి చెందింది ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి శ్రీరాముల శ్రీహన్సిక (3) అనే చిన్నారి కొలనుపాకకు చెందిన శ్రీరాముల కరుణాకర్ కుమార్తె. కరుణాకర్ గ్రామంలో మంగలి దుకాణం నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇంటి ముందు ఆడుకుంటున్న శ్రీహన్సికను వేగంగా వచ్చిన ట్రాలీ ఆటో ఢీ కొట్టింది తీవ్రంగా గాయపడిన చిన్నారిని వెంటనే ఆలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. అయితే తరలించేలోపే చిన్నారి తుదిశ్వాస విడిచింది. చిన్నారి మృతితో గ్రామమంతా విషాదంలో మునిగిపోయింది. తల్లిదండ్రుల రోదనలు స్థానికులను కంటతడి పెట్టించాయి. ఆలేరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు





## ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే 33 శాతం మహిళా రిజర్వేషన్ చట్టాన్ని వెంటనే అమలు చేయాలి

**ఐద్వా, పి ఓ డబ్ల్యు**

**భువనగిరి జూలై 21 మహా :** ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లోనే 33 శాతం మహిళా రిజర్వేషన్ చట్టం-2023ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ భువనగిరి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మంగళవారం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) మరియు ప్రగతిశీల మహిళా సంఘం (పి ఓ డబ్ల్యు) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పి ఓ డబ్ల్యు రాష్ట్ర కార్యదర్శి రాచకొండ సీత జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టుపల్లి అనురాధ మాట్లాడుతూ, పార్లమెంట్‌లో మహిళా బిల్లును వెంటనే ఆమోదించి అమలు చేయాలని కోరారు. జనగణన, నియోజకవర్గాల పునర్విభజన (డిలిమిటేషన్)తో మహిళా రిజర్వేషన్ అమలును ముడిపెట్టడం తగదని, అలాంటి షరతులు లేకుండా మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు.అలాగే, మహిళా రిజర్వేషన్ చట్టం-2023ను ఆలస్యం చేయకుండా వెంటనే అమలు చేయాలని, చట్టంలో పొందుపరిచిన 15 సంవత్సరాల గడువు నిబంధనను తొలగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మహిళలకు రాజకీయాల్లో సమాన అవకాశాలు కల్పించడం ప్రజాస్వామ్య బలోపేతానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు

ఈ కార్యక్రమంలో పి ఓ డబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోతు సుగుణ, ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు భువనగిరిపట్టణ అధ్యక్షురాలు మాయ రాణి, ఎన్ పి ఆర్ డి జిల్లా నాయకురాలు కొత్త లలిత, జిల్లా నాయకులు గంధ మల్ల బాలమణి, గడ్డం పద్మ, లక్ష్మి నర్సమ్మ, కొమ్మిడి లత, అంబటి లలిత, అండాలు తదితరులు పాల్గొన్నారు.



## రహదారులపై ప్రమాదాల నివారణకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలి

**రాష్ట్ర రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్**

**యాదాద్రి భువనగిరి జూలై 21 మహా :** జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని రాష్ట్ర రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్ అన్నారు. మంగళవారం హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయం నుండి రవాణా శాఖ కమీషనర్ ఇలంబర్తి, శాంతి భద్రతల అధికారులు, రవాణా, రహదారి భవనాలు, జాతీయ రహదారుల శాఖల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు, రవాణా, రహదారులు భవనాల శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలోని జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం జాతీయ రహదారులపై ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు తీసుకోవాలని, జిల్లాస్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశాలు ప్రతినెల నిర్వహించాలని తెలిపారు. టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేయాలని, జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగే ప్రాంతాలు, బ్లాక్ స్పాట్ లను గుర్తించి రక్షణ చర్యలు చేపట్టాలని అంబులెన్స్ లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. ప్రమాదాలు జరిగిన వెంటనే క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని, రహదారి భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. వాహనదారులు తప్పకుండా సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లడుతూ జిల్లాలోని జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారురోడ్డు భద్రత కింద జారీ చేసిన ఆదేశాలను జిల్లాలో పక్కాగా అమలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్ లో డిప్యూటీ కలెక్టర్ కృతిక,జిల్లా రవాణా శాఖ అధికారి నరేష్,ఆర్ అండ్ బి అధికారి సరిత పాల్గొన్నారు.

## కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

**టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ముక్కెర్ల యాదయ్య**

**భువనగిరి జూలై 21 మహా :** కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రికి పోస్ట్ కార్డుల ద్వారా విన్నపమును తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కేజీబీవీ భువనగిరిలో మంగళవారం పోస్ట్ కార్డుల ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ కేజీబీవీ ఉపాధ్యాయుల, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, కేజీబీవీ టీచర్ల సర్వీసును రెగ్యులరైజ్ చేయాలని, టైం స్కేల్ ను ఇవ్వాలని ,ఉద్యోగుల ఆరోగ్య పథకములో కేజీబీవీ వారిని కూడా చేర్చాలని, 29 రోజుల సమ్మె కాలం జీతాన్ని చెల్లించాలని, ప్రతి పాఠశాలకు కేర్ టేకర్ ను నియమించాలని



ఈ సం. అనంతరం పోస్ట్ కార్డులను స్థానిక పోస్ట్ ఆఫీస్ లో పోస్ట్ ఆఫీస్ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రికి పంపించారు ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి జివి రమణ రావు, జిల్లా నాయకులు పి. గోపాలకృష్ణ ,పి సుదర్శన్ రెడ్డి, గడ్డమీద వెంకటేశం తదితరులు పాల్గొన్నారు



## పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

- **మంచినీళ్లకు మిషన్ భగీరథ నీళ్ళే దిక్కు**
- **అసౌకర్యాల నడుమ మంచి ఉత్తీర్ణత సాధిస్తున్న పాఠశాల**
- **ప్రభుత్వాలు పట్టించుకుంటే పేద విద్యార్థులకు మరింత లాభం**
- **ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రానికి ప్రహరీ గోడ నిర్మించాలి**

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** బాబుక్యంపు ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఎం టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు తెలిపారు. సిపిఎం టౌన్ కమిటీ ఆధ్వర్యంలో బాబుక్యాంపు ప్రభుత్వ పాఠశాల విద్యానగర్ ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో ఉన్న సమస్యలను అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు మాట్లాడుతూ పాఠశాలలో రెండు వందల మంది విద్యార్థులు ఉంటే విద్యార్థుల సంఖ్య కనుగుణంగా మూత్రశాలలు మరుగుదొడ్లు లేవని తెలిపారు. అరకొరగా ఉన్న మూత్రశాలలు కూడా స్కావెంజర్ లేక శుభ్రంగా లేవని తెలిపారు. మూత్రశాలలకు నీటి సరఫరా లేక దుర్వాసన వస్తున్నాయని తెలిపారు. ఆరవ తరగతి విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు అందలేదని తెలిపారు. మధ్యాహ్న భోజన కార్మికుల జీతాలు సరిగా రావడం లేదని పాఠశాల ప్రారంభం నుంచి వంట చేసిన బిల్స్ పెండింగ్ లోనే ఉన్నాయని తెలిపారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో పాటు పదో తరగతి పరీక్షల్లో కూడా మంచి ఫలితాలు సాధిస్తున్న ఇలాంటి ప్రభుత్వ పాఠశాలకు ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పనకు అవసరమైన నిధులు కేటాయిస్తే ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం అవుతాయని అన్నారు. ప్రభుత్వ పరీక్షలు నిర్వహించే కేంద్రం కూడా పాఠశాలలోనే ఉండడం వలన విద్యార్థులకు గదులు సరిపోవట్లేదని అన్నారు. ఏసిజి సెంటర్ ను పాత డీఈఓ ఆఫీసుకు తరలిస్తే విద్యార్థులకు ఆ గది ఉపయోగ పడుతుందని తెలిపారు.విద్యానగర్ ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రానికి ప్రహరీ గోడ లేక రాత్రిపూట అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని తెలిపారు. మూడువేల మంది జనాభాకు వైద్య సదుపాయం అందించే కేంద్రంగా ఉన్న ఈ ఉప కేంద్రంలో మంచినీటి సౌకర్యం లేక వచ్చిన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి హాస్పిటల్కు ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టాలని మంచినీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గడల నరసింహారావు, ఎంఎస్ ప్రకాష్, సతీష్, బాలకృష్ణ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## ధర్మారెడ్డి కాల్వ ద్వారా నీటి విడుదల

- **ధర్మారెడ్డి కాల్వ ద్వారా నీటి విడుదల**
- **ప్రభుత్వ విప్ వేముల వీరేశం**
- **భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి**



వలిగొండ జులై 21 మహా న్యూస్ వలిగొండ మండలంలోని ధర్మారెడ్డి కాల్వ జీరో వద్ద నుండి దిగువ ప్రాంతాలకు సాగునీటి విడుదల చేసిన ప్రభుత్వ విప్ నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం మరియు స్థానిక భువనగిరి శాసనసభ్యులు కుమార్ అనిల్ కుమార్ రెడ్డి ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ వేముల వీరేశం మాట్లాడుతూ నకిరేకల్ నియోజకవర్గ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన ధర్మారెడ్డి కాల్వ ద్వారా నీటిని విడుదల చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూధర్మారెడ్డి కాల్వ ద్వారా ఈ ప్రాంత ప్రజలకు సాగునీరు అందించడం రైతు ప్రజా ప్రభుత్వం అని నిరూపించడం జరిగిందన్నారు.



## వంగపల్లి పిఏసిఎస్ పాలకవర్గం ప్రమాణ స్వీకారం

- **పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య**

**యాదాద్రి భువనగిరి జూలై 21 మహా** యాదాద్రి భువనగిరి జిల్లా, యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ( పిఏసిఎస్) పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ముఖ్య అతిథిగా హాజరై నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన చైర్మన్ నెమ్మాని సుబ్రహ్మణ్యం, పాలకవర్గ సభ్యులతో కలిసి ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం చైర్మన్ నెమ్మాని సుబ్రహ్మణ్యంను కార్యాలయంలోని చైర్మన్ కుర్చీలో కూర్చోబెట్టి, పదవీ బాధ్యతలను అధికారికంగా స్వీకరింపజేశారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య నూతన చైర్మన్‌ను శాలువాతో సన్మానించి, రైతులకు అంకితభావంతో సేవలందించాలని ఆకాంక్షించారు. సభలో బీర్ల అయిలయ్య మాట్లాడుతూ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలాంటివని అన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పంట రుణాలు, ధాన్యం కొనుగోలు, వ్యవసాయానికి సంబంధించిన అన్ని సేవలను పారదర్శకంగా అందించడంలో పిఏసిఎస్ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ప్రజా సంక్షేమ పాలన కొనసాగుతోందని అన్నారు. రైతులకు అవసరమైన సౌకర్యాలను మరింత విస్తరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, సహకార సంఘాలు రైతులకు మరింత చేరువై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పాలన అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి గ్రామంలో అభివృద్ధి ఫలాలు అందేలా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని బీర్ల అయిలయ్య తెలిపారు.

## పోడు రైతులకు అండగా ఉంటాం..

- **అధైర్యపడొద్దు.. బాధ్యులపై చర్యలు తప్పవు..**
- **ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**



**అశ్వాపురం /మణుగూరు, మహా :** పోడు భూముల వివాదాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న గిరిజన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, బాధితులు అధైర్యపడాల్సిన అవసరం లేదని పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు భరోసా ఇచ్చారు. మంగళవారం అశ్వాపురం మండలంలోని వేములూరు, మనుబోతులపాడు గ్రామాల్లో ఇటీవల ఫారెస్ట్ అధికారుల చర్యల్లో గాయపడిన, ఇబ్బందులు ఎదుర్కొన్న గిరిజన రైతులను ఆయన పరామర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేములూరు గ్రామంలో గాయపడిన పోడు రైతుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే, వారికి మెరుగైన వైద్య సేవలు అందేలా వెంటనే చర్యలు చేపట్టారు. స్థానిక సర్పంచ్ తో పాటు అశ్వాపురం కాంగ్రెస్ మండల అధ్యక్షుడిని వారికి తోడుగా పంపించి భద్రాచలం ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు. అనంతరం మనుబోతులపాడు గ్రామంలో ఫారెస్ట్ అధికారుల దాడికి గురైన గిరిజనులను పరామర్శించారు. గిరిజన మహిళలపై బూట్లు, కర్రలతో దాడి చేయడం, ఒక మహిళను ఫారెస్ట్ అధికారి సంపత్ జుట్టు పట్టుకుని ఈడ్చి కిందపడేసి కాలితో తొక్కడం అత్యంత అమానుషమని ఎమ్మెల్యే తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనపై ప్రభుత్వం ఇప్పటికే స్పందించిందని, దాడికి పాల్పడిన ఫారెస్ట్ అధికారి సంపత్‌ను సస్పెండ్ చేయడంతో పాటు సంబంధిత అటవీ రేంజ్ అధికారి సహా మరో ముగ్గురు అధికారులకు మెమోలు జారీ చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో గిరిజనుల పట్ల చట్టవ్యతిరేకంగా, అమానుషంగా వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోడు భూముల సమస్యపై గిరిజన రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. బాధితులు ఎలాంటి ఆందోళన చెందకుండా ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్థులు, గిరిజన రైతులు ఎమ్మెల్యేతో కలిసి బాధితులను పరామర్శించారు.

## గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో.. బాలికలకు హెచ్‌పీవీ టీకా..

**ఆరోగ్య శిబిరం నిర్వహణ..**



**మణుగూరు, మహా :** గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణలో భాగంగా 14-15 సంవత్సరాల బాలికలకు హెచ్‌పీవీ టీకాను మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం అందజేశారు. మణుగూరు పరిధిలోని లంకమల్లారం గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో అర్హులైన బాలికలకు టీకాలు వేసి, అనంతరం ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణ, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా అవసరమైన సమయంలో వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు డాక్టర్ ఉమాదేవి, వైద్య సిబ్బంది సత్తెమ్మ, స్వరూపరాణి, జానకి, రాంప్రసాద్, సుమ, రాధా తదితరులు పాల్గొన్నారు.



## కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో

# ఖర్గే జన్మదిన వేడుకలు

**ఆదిలాబాద్ మహా** : అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, రాజ్యసభ ప్రతిపక్ష నాయకులు మల్లికార్జున్ ఖర్గే జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం పట్టణంలోని కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో జరిగిన వేడుకలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు వివిధ అనుబంధ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. ఒకరికొకరు కేక్ తినిపించుకొని మల్లికార్జున ఖర్గే కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆత్మకమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్‌రావు మాట్లాడుతూ మతతత్వ బీజేపీకి వ్యతిరేకంగా సెక్యులర్ భావజాలంతో పోరాడుతూ ఖర్గే కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేసారని ఆయన సేవలను కొనియాడారు. రాహుల్ గాంధీని ప్రధాని గా చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు ఖిజర్ పాషా,జిల్లా మైనారిటీ చైర్మన్ షాహిద్ అలీ, కౌన్సిలర్ మహెబూబ్,సర్పంచ్ అచ్చుత్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారి సతీష్, నాయకులు కొండా గంగాధర్, లోక ప్రవీణ్ రెడ్డి, అల్చెట్టి నాగన్న, దేవిదాస్ చారి, గుడిపెల్లి నగేష్, ఎంఏ షకీల్, ఖలీల్,దేవిదాస్,రాజేశ్వర్, సంతోష్, మహేందర్, నవీన్, డేరా కృష్ణా రెడ్డి, శ్రీలేఖ ,కావేటి జ్యోతి తదితరులు పాల్గొన్నారు



# సామాజిక సేవలో ముందుకు..

**బనిర్మల్ మహా:** సామాజిక సేవలో లయన్స్ క్లబ్స్ ఎల్లప్పుడూ ముందుంటాయని ప్రాజెక్ట్ చైర్మన్ లయన్ నేరెళ్ల హనుమంతు అన్నారు. మంగళవారం తన మనవరాలు స్మృతి పుట్టినరోజును పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆఫ్ నిర్మల్ , ముప్కాల్ సంయుక్త ఆధ్వర్యంలో మెండోరా మండలం దూదిగాం గ్రామంలో గల సిఎస్ఐ హాస్టల్లో విద్యార్థులకు పండ్లు బిస్కట్ ప్యాకెట్లతో పాటు ఫ్యాన్లు పంపిణీ చేసారు. తన మనవరాలి పుట్టిన రోజు విద్యార్థుల మధ్య జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందని హనుమంతు అన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాల జోలికి పోకుండా శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. ఇతరుల అవసరాలకు అండగా సామాజిక సేవలను చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో నిర్మల్, ముప్కాల్ అధ్యక్షులు లయన్ వెంకట్ రమణ రెడ్డి,లయన్ సిద్ధ రమేష్ కుమార్, నిర్మల్ క్లబ్ కార్యదర్శి లయన్ శ్రీనివాస్ గుప్త కోశాధికారి లయన్ విజయ్ కుమార్ పి ఆర్ సి పిడుగు గంగారెడ్డి, జోన్ చైర్మన్ చంద్రమోహన్ రెడ్డి, సాదుల లక్ష్మణ్, ప్రాజెక్ట్ చైర్మన్ నేరెళ్ల హనుమంతు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ డైవర్షన్ ఎత్తివేత

**భద్రాద్రి కొత్తగూడెం, మహా :** ఇల్లందు క్రాస్–బొమ్మనపల్లి క్రాస్ మధ్య లోతువాగు వద్ద జాతీయ రహదారిపై ఓవర్‌బ్రిడ్జి మరమ్మతు పనులు పూర్తవడంతో బుధవారం నుంచి ట్రాఫిక్ డైవర్షన్‌ను ఎత్తివేశారు. వాహనాలు యథావిధిగా బ్రిడ్జిపై ప్రయాణించవచ్చని డీఎస్పీ ఆదినారాయణ తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వాహనదారులకు సూచించారు.





# మణుగూరు ఓసీపీలో మెగా వృక్షారోపణ..

- హరితాభివృద్ధికి నాటిన 550 మొక్కలు...
- పది వేల మొక్కల లక్ష్యంతో ముందుకు..
- మణుగూరు ఏరియాటజీఎం దుర్గం రామచందర్..

**మణుగూరు, మహా** : పర్యావరణ పరిరక్షణ, హరితావరణ విస్తరణ లక్ష్యంగా మణుగూరు ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టులో మంగళవారం మెగా వృక్షారోపణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భారత ప్రభుత్వ బొగ్గు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని కోల్ కంట్రోలర్ ఆర్గనైజేషన్ ఆదేశాలు, సింగరేణి కార్పొరేట్ కార్యాలయం సూచనల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమానికి ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అన్నారు. నేడు నాటే ప్రతి మొక్క భావితరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడం, జీవవైవిధ్యాన్ని కాపాడడం, పచ్చదనాన్ని పెంపొందించడం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను కూడా తీసుకోవాలని పిలుపునిచ్చారు. మెగా వృక్షారోపణ కార్యక్రమంలో భాగంగా మణుగూరు ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు పరిధిలో 550 మొక్కలను నాటారు. మణుగూరు ఏరియాకు నిర్దేశించిన 10 వేల మొక్కల లక్ష్యాన్ని సాధించేందుకు రీక్లెయిమ్ చేసిన గని ప్రాంతాలు, ఓబీ డంపులు, రహదారుల వెంట, ఇతర అనుకూల ప్రదేశాల్లో మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. నాటిన మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు, జియో ట్యాగింగ్‌తో పాటు ఫొటోలు, వీడియోల ద్వారా నమోదు చేసి వాటి మనుగడ శాతాన్ని పెంచేందుకు నిరంతర పర్యవేక్షణ చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం డి. వెంకటరామరావు, ఏజీఎం (పర్సనల్) ఎస్. రమేష్, కెపియు.జి పిఓ వేణుమాధవ్, ఏరియా ఇంజినీర్ బి. మధన్ నాయక్, ప్రాజెక్టు అధికారి ఈ. శ్రీనివాస్, మేనేజర్ టి. శ్రీరంగారెడ్డి, ప్రాజెక్టు ఇంజినీర్ సురేశ్, పర్యావరణ అధికారి కిషన్ రామ్, ఏరియా పర్యావరణ అధికారి జే. శ్రీనివాస్, ఏరియా ఎస్టేట్ అధికారి స్వప్న, ఏరియా ఫారెస్ట్ అధికారి బి. కల్యాణ్, సెక్యూరిటీ అధికారి కె. శ్రీనివాస్, సంక్షేమ అధికారి డి. నరేశ్, గుర్తింపు కార్మిక సంఘాల నాయకులు ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై. రాంగోపాల్, ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వి. కృష్ణంరాజు, ఇతర అధికారులు, ఉద్యోగులు, కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, పర్యావరణ, అటవీ విభాగాల సిబ్బంది పాల్గొని మొక్కలు నాటారు.

# ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన వసతులు

**మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య**



**మంచిర్యాల, మహా :** ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పిస్తున్నామని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య అన్నారు. మంగళవారం హాజీపూర్ మండలం కర్ణమామిడి గ్రామపంచాయతీ, లక్షెట్టిపేట, దండేపల్లి మండలం కర్ణపేట గ్రామంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల పరిసరాల పరిశుభ్రత, తరగతి గదులు, వసతి, భోజనశాల, వంటశాల, త్రాగునీటి వసతులు, విద్యార్థినులకు అందిస్తున్న భోజన నాణ్యత, విద్యాబోధన, హాజరు రిజిస్టర్లు తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేస్తుందని అన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించి నాణ్యమైన విద్య అందిస్తుందని వెల్లడించారు.విద్యార్థులతో మాట్లాడి బోధన, వసతులు, భోజన నాణ్యత, వసతిగృహ సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని, విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచడంతో పాటు విద్యార్థుల సంఖ్య పెంపుపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. పాఠశాలలలో నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదులు, స్కూల్ కాంప్లెక్స్ తదితర పనులను వేగవంతంగా పూర్తి చేసి త్వరగా వినియోగంలోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పాఠశాలలు, వసతి గృహాలు, గ్రామాలలో పరిశుభ్రతను కట్టుదిట్టంగా నిర్వహించాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. త్రాగునీటి పైప్‌లైన్లలో లీకేజీలు లేకుండా చూసి, క్లోరినేషన్ చేసిన సురక్షిత నీటిని ప్రజలకు, విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. హాజీపూర్ మండల కర్ణమామిడి గ్రామపంచాయతీని సందర్శించి గ్రామంలో మురుగు కాలువల నిర్వహణ, పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టాలని, వర్షాకాలంలో కూలిపోయే ప్రమాదంలో, శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి, అవసరమైతే ఆయా కుటుంబాలను తక్షణమే పునరావాస కేంద్రాలకు తరలించేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆ తర్వాత లక్షెట్టిపేట కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం సందర్శనలో పాఠశాల పరిసర ప్రాంతాలలో వీధి దీపాలు పనిచేయడం లేదని గుర్తించి, సంబంధిత విద్యుత్ శాఖ అధికారులను పిలిపించి వెంటనే మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా మున్సిపల్ కమిషనర్‌కు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో మండల పంచాయతీ అధికారి సుమన్, మండల విద్యాధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, ప్రత్యేక అధికారులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, పాఠశాల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, విద్యుత్ శాఖ అధికారులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# ఆకతాయిలకు పేరెంట్స్ సమక్షంలో అవగాహన

**ఆదిలాబాద్ మహా** : మహిళలు చిన్నారులను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు. మహిళలను, చిన్నారులను, పాఠశాల విద్యార్థులను వివిధ రకాలుగా వేధించిన 180 మంది ఆకతాయిలు వారి కుటుంబ సభ్యులకు మంగళవారం స్థానిక పోలీసు ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ లో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మహిళల,విద్యార్థుల పట్ల, వారి భద్రత పట్ల ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మహిళలను చిన్నారులను వేధించే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. గత ఆరు నెలల కాలంలో జిల్లాలో 230 పెట్టి కేసులు 20 కి పైగా ఎఫైర్ కేసులు నమోదు అయినట్లు తెలిపారు. ఈ కేసులలో నిందితులకు వారి తల్లిదండ్రుల సమక్షంలో అవగాహన కల్పించినట్టు తెలిపారు. మహిళల ఫోన్ నెంబర్లకు కాల్స్ చేస్తూ వేధించే పనులు మానుకోవాలని, ఇలాంటి వారిపై పెట్టి కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. ఇది చివరి అవకాశంగా సూచిస్తూ, ఇకనుండి మహిళలను చిన్నారులను వేధించే వారిపై ఎఫ్ఐఆర్ కేసులు నమోదు చేసి కఠినమైన చర్యలను తీసుకోబడతాయని హెచ్చరించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మహిళల రక్షణకు భద్రతకు అపాయం కలిగించిన వారినీ ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల బాధ్యతగా వ్యవహరిస్తూ, సరళమైన పద్ధతిలో వారిని సక్రమమైన దిశలో మార్చేలా అవగాహన కల్పించాలని తెలిపారు. కేసులు నమోదు అయితే వారికి భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు వచ్చే సమయంలో పోలీసు క్లియరెన్స్ సర్టిఫికెట్ లభించదని, విదేశాలకు వెళ్లాలనుకుంటే పాస్పోర్ట్ కు అడ్డంకులు వస్తాయని, ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటాయని అన్నారు. అందుకే ఎలాంటి కేసుల బారిన పడకుండా ఉండాలని మహిళలను చిన్నారులను వేధించడం మానుకోవాలని సూచించారు. చెడు సావాసాలను మానుకోవాలని, మంచి తనంతో, మంచి ప్రవర్తనతో ఉండాలని సూచించారు. చెడు సావాసాలను మానుకోవాలని, మంచి తనంతో, మంచి ప్రవర్తనతో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి మౌనిక , ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, సీఐలు కె నాగరాజు, కె ఫణిదర్, షీ టీం బృంద సభ్యులు సుశీల, వాణిశ్రీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# భూక్యా కిరణ్ సేవలు చిరస్మరణీయం

- సన్మాన సభలో కొనియాడిన వక్తలు
- బదిలీపై వెళ్తున్న కిరణ్ కు ఘన సన్మానం

**భద్రాద్రి కొత్తగూడెం, మహా**:కొమరారంలో గత ఎనిమిది సంవత్సరాల కాలంగా ప్రజలకు సేవలు అందించి ఉద్యోగ బదిలీ రీత్యా మరో ప్రాంతానికి వెళ్ళిన భూక్యా కిరణ్ కు కొమరారం ప్రస్తుత, మాజీ పాలకవర్గం మంగళవారం ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సన్మాన కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు కొమరారం సర్పంచ్ అజ్మీర బిచ్చ సభా అధ్యక్షత వహించారు. కొమరారం ప్రాంతంలో అన్ని వర్గాల ప్రజలతో సత్సంబంధాలు ఏర్పాటు చేసుకొని అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికి ప్రచారంలోకి తీసుకెళ్లడంలో కార్యదర్శి భూక్య కిరణ్ ఎనలేని కృషి చేశారని కొనియాడారు. కొమరారం గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ వైద్య శాలలో ఎలక్ట్రికల్, మంచినీరు, పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి ప్రజల మన్ననలను పొందారని తెలిపారు. ప్రజలతో స్నేహ సంబంధాలు, ప్రతి ఒక్కరితో కలిసిమెలిసి ఉండడం ఎవరికి ఏ సమస్య వచ్చినా దానిని ఎలా పరిష్కరించాలో అవగాహనతో తెలపడం గ్రామపంచాయతీకి వచ్చిన అభివృద్ధి పనులపై సలహాలు సూచనలు ఇస్తూ తన ఉద్యోగ బాధ్యతను నెరవేర్చారని గ్రామ ప్రజలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బుర్రి ప్రవీణ్, హైస్కూల్ హెచ్ఎం లింగ్యా, ప్రైమరీ స్కూల్ హెచ్ఎం ఉమారాణి, సీనియర్ జర్నలిస్ట్ లింగాల వెంకన్న, మాజీ పిఎసిఎస్ వైస్ చైర్మన్ పోలేపల్లి నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ కోరం ముత్తక్క, కొమరారం వ్యాపార వర్గం రాజేశ్వరరావు, పెద్ద చారి, మాజీ ఉపసర్పంచ్ మూడు మాలు, మాజీ పాలకవర్గ సభ్యులు వెలుగు శాంతారావు, వాంకుడోత్ శంకర్, విజయ,వేప రాణి, లక్ష్మీ, కుంజ పాపయ్య ప్రస్తుత పాలకవర్గ సభ్యులు భారతి, గుగులోతు శ్రీను, జోగ మాధవి, కాంపాటి మౌనిక, పివైఎల్ నాయకులు వాంకుడోత్ మోతిలాల్, ప్రభుత్వ ఉపాధ్యాయులు, వివోలు, అంగన్వాడి టీచర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది, మిషన్ భగీరథ ఆపరేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# చట్టాలపై అవగాహన

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:**హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కొత్తగూడెం సబ్ రిజిస్టర్ కార్యాలయ ప్రాంగణం నందు వినియోగదారులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ బుడ్డపాటి దాసు, తెలంగాణ స్టేట్ ప్రెసిడెంట్ కాలం సుధాకర్ రావు, సబ్ రిజిస్టర్ అప్పారావు, జిల్లా ప్రెసిడెంట్ మాలోత్ రాందాస్ నాయక్ రిజిస్ట్రేషన్ మానవ వినియోగదారుల హక్కుల మహిళల హక్కులపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా సలహా బోర్డు ప్రెసిడెంట్ ఎస్.కె అబ్బాస్, జిల్లా మెంబర్ విజయలక్ష్మి, జిల్లా ఇన్చార్జి గడ్డం శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు. ఇది ఇలా ఉండగా జిల్లా పోలీస్ సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ రోహిత్ రాజుని, కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణను హ్యూమన్ రైట్ ఫౌండేషన్ టీం మర్యాదపూర్వకముగా కలిసి ఆగస్టు 4వ తేదీన జరిగే చట్టములపై అవగాహన సదస్సుకు ఆహ్వానించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ, డి.ఎస్.పి హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ సేవలను టీం వారిని అభినందించారు.



# విద్యార్థుల అభ్యసనా నైపుణ్యాల పెంపుకు కృషి

**ఆదిలాబాద్ మహా**: విద్యార్థుల అభ్యసనా నైపుణ్యాల పెంపునకు అధ్యాపకులు కృషి చేయాలని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా సూచించారు. విద్యార్థులలో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు, తరగతి గదుల్లో వారిని క్రియాశీలకంగా ఉంచేందుకు అధ్యాపకులు నిరంతరం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని స్థానిక జిల్లా ఇంటర్మీడియేట్ కార్యాలయంలో తెలుగు లెక్చరర్ల కు నిర్వహించిన ప్రత్యేక ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు సబ్జెక్టులపై స్పష్టత వచ్చేలా బోధనా పద్ధతులలో మార్పులు తీసుకురావాలని సూచించారు. ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించడంతో పాటు, అధ్యాపకులు తమ కమ్యూనికేషన్ స్కిల్స్‌ను మెరుగుపరుచుకోవాలని సూచించారు. కళాశాలల్లో నూతన పాఠ్యపుస్తకాల లభ్యతను పరిశీలించి, ఎక్కడైనా కొరత ఉంటే వెంటనే ప్రిన్సిపాల్, డి.ఐ.ఈ.ఓ ల దృష్టికి తీసుకువెళ్లి నివారించాలన్నారు. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ వినియోగాన్ని పెంచాలని, ఆన్‌లైన్ ప్లాట్ ఫారమ్‌ల ద్వారా లభించే విద్యా విషయాలను తరగతి గదుల్లో ప్రాక్టీస్ చేయించాలని సూచించారు. విద్యార్థుల ప్రగతిని అంచనా వేసేందుకు ప్రతిరోజూ హోంవర్క్ ఇవ్వాలన్నారు. వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచేందుకు తొలుత సులువైన ప్రశ్నలు, ఆపై మధ్యస్థ, కఠినమైన ప్రశ్నలతో సాధన చేయించాలన్నారు. అనంతరం కలెక్టర్ చేతుల మీదుగా ఇంటర్మీడియట్ విద్యా శాఖ, ఆధ్వర్యంలో నిర్వహించిన ఓరియంటేషన్ ప్రోగ్రామ్ లో సర్టిఫికెట్ ఆఫ్ పార్టిసిపేషన్ పత్రాలను అందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాశాఖ అధికారి జాదవ్ గణేష్ కుమార్, ఇతర అధికారులు, బోధన సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# వైద్యం కోసం వస్తే.. సమస్యలే స్వాగతిస్తున్నాయి..

- మణుగూరు వంద పడకల ఆస్పత్రికి రూ.2 కోట్లు కేటాయించాలి..
- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య

**మణుగూరు, మహా** : ఏజెన్సీ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని, మణుగూరు ప్రభుత్వ వంద పడకల ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం నాయకులతో కలిసి ఆసుపత్రిని పరిశీలించిన ఆయన వైద్యులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పలు కీలక అంశాలను ప్రస్తావించారు. మణుగూరు, పినపాక, కరకగూడెం, అశ్వాపురం మండలాలతో పాటు ములుగు జిల్లా రాజుపేట, మంగపేట ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు వైద్య సేవల కోసం మణుగూరు ప్రభుత్వ ఆసుపత్రికి వస్తున్నారని తెలిపారు. సాధారణ రోజుల్లో 300 నుంచి 400 మంది వరకు ఓపీ ఉండగా, సీజన్‌లో అది 600 నుంచి 700కు చేరుకుంటోందన్నారు. ఇన్‌పేషెంట్లు 120 మందికి పైగా ఉండటంతో పడకలు సరిపోక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆసుపత్రిలో 27 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 15 మంది మాత్రమే పనిచేస్తున్నారని, వారిలో ఇద్దరు మాత్రమే రెగ్యులర్ ప్రభుత్వ వైద్యులని, మిగతావారంతా కాంట్రాక్ట్ వైద్యులేనని పేర్కొన్నారు. వైద్య సిబ్బంది కొరతతో ప్రజలకు సకాలంలో మెరుగైన వైద్యం అందడం లేదన్నారు. వంద పడకల ఆసుపత్రికి కనీసం ఒక అంబులెన్స్ కూడా లేకపోవడం దురదృష్టకరమని, సూది మందులు ఇచ్చేందుకు అవసరమైన సిరంజిలు కూడా తగినంతగా లేవని విమర్శించారు. ఆసుపత్రిలోని వాటర్ ప్లాంట్ మూడు నెలలుగా మరమ్మతుల్లోనే ఉండటంతో రోగులు, వారి బంధువులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రమాద బాధితులకు అత్యవసర వైద్య సేవలు అందించే ట్రామా కేర్ సెంటర్ లేకపోవడం కూడా తీవ్రమైన లోపమని అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో రక్తహీనత సమస్య ఎక్కువగా ఉన్నప్పటికీ ఆసుపత్రిలో ఐరన్ మాత్రలు కూడా అందుబాటులో లేవని ఆయన ఆరోపించారు. మెరుగైన వైద్యం కోసం భద్రాచలం, కొత్తగూడెం వెళ్లాల్సిన పరిస్థితి ఉండటంతో పలువురు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం తక్షణమే రూ.2 కోట్లు కేటాయించాలని, వంద పడకల ఆసుపత్రిని 150 పడకలకు అప్‌గ్రేడ్ చేయాలని, ప్రస్తుత ఏరియా ఆసుపత్రిని కొనసాగిస్తూ అవసరాలకు అనుగుణంగా నూతన ఆసుపత్రి భవనాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి సత్రపల్లి సాంబశివరావు, సీనియర్ నాయకుడు కొడిశాల రాములు, పగిడేరు సర్పంచ్ కుంజా శ్రావణ్ కుమార్, మండల కార్యదర్శివర్గ సభ్యులు పిట్టల నాగమణి, బొల్లం రాజు, రైతు సంఘం మండల అధ్యక్షుడు సంకినేని వెంకటరావు, సుబ్బారావు, గుర్రం నరసయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఢిల్లీలో విద్యార్థులపై పోలీసుల దౌర్జన్యం అమానుషం

**సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కాకర్లపల్లిలో ప్రధాని మోడీ దిష్టిబొమ్మ దహనం**

**సత్తుపల్లి, జూలై 21: మహా:** నీట్ పరీక్షా పత్రాల లీకేజీపై, సామాజికవేత్త వాంగ్ చుక్ ను పోలీసులు అరెస్టు చేయడానికి నిరసిస్తూ విద్యార్థులు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై పోలీసులు విచక్షణా రహిత లాఠీచార్జి, బాష్పవాయువును ప్రయోగించడాన్ని నిరసిస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సత్తుపల్లి మండలం కాకర్లపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం సాయంత్రం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా జరిగిన నిరసన కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు మాట్లాడుతూ... విద్యార్థులపై పోలీసులు జరిపిన అమానుష దాడి ప్రజాస్వామ్య విరుద్ధమని తీవ్రంగా ఖండించారు.నిరసనకారులపై లాఠీఛార్జికి ఆదేశించిన పోలీసు అధికారులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత 23 రోజులుగా సోనమ్ వాంగ్ చుక్ ఢిల్లీలో నిరసన దీక్ష చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకుండా, విద్యార్థుల గొంతు నొక్కాలని చూడటం విచారకరమన్నారు. మోదీ ప్రభుత్వం తక్షణమే విద్యార్థుల డిమాండ్లను అంగీకరించాలని, అరెస్టయిన వారందరిని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)ని వెంటనే రద్దు చేయాలన్నారు. నీట్ పరీక్షల పేపర్ లీకేజీ కారణంగా అనేకమంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోగా, లక్షలాది మంది మానసిక క్షోభకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కమిటీ నాయకులు వేపులపాటి కుమారస్వామి, కువ్వారపు లక్ష్మణరావు, కావూరి వెంకటేశ్వరరావు, బెజవాడ లక్ష్మీనారాయణ, తడికమళ్ల రామకృష్ణ, దాట్ల రాంబాబు, వేపులపాటి పుష్పావతి, శైలజ, షేక్ యాకూబ్ పాల్గొన్నారు.



## సీతారామ పరిహారం అపహాస్యం

- **ఏడేళ్లైనా పరిహారం లేదు**
- **పీసా చట్టం అమలు కాలేదని ఆరోపణ**
- **గిరిజన రైతుల ఆందోళన హెచ్చరిక**

**దమ్మపేట, మహా :** సీతారామ ప్రాజెక్టు కాలువల కోసం భూములు కోల్పోయిన గిరిజన రైతులకు ఇప్పటికీ న్యాయమైన నష్టపరిహారం అందలేదని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలానికి చెందిన భూ నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై మంగళవారం పట్వారిగూడెంలోని ఆదెమ్మ ఫంక్షన్ హాల్ లో సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు.జగ్గారం, అంకంపాలెం, ఆర్లపెంట, పట్వారి గూడెం తదితర గ్రామాల్లో 2019లో కాలువల కోసం భూసేకరణ చేపట్టి ఎకరానికి రూ.8 లక్షల పరిహారం ఇస్తామని హామీ ఇచ్చినా, ఏడేళ్లు గడిచినా అమలు కాలేదని రైతులు తెలిపారు. మరోవైపు అదే జిల్లాలో ఇతర ప్రాంతాల్లో ఎకరానికి రూ.14 నుంచి రూ.20 లక్షల వరకు పరిహారం ఇవ్వగా, తమకు మాత్రం తక్కువ నిర్ణయించడం అన్యాయమని ఆరోపించారు. పీసా చట్టం ప్రకారం గ్రామసభలు, పీసా కమిటీల అనుమతులు లేకుండానే పనులు చేపట్టారని, కొన్నిచోట్ల నకిలీ తీర్మానాలు సృష్టించారని గిరిజన నాయకులు ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.పామాయిల్ తోటలకు భారీ నష్టం వాటిల్లుతున్నందున ఎకరానికి రూ.40 లక్షల పరిహారం లేదా ఒక్కో పామాయిల్ చెట్టుకు రూ.1.50 లక్షలు ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకు కాలువ పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు.ఈ సమావేశంలో వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, గిరిజన నాయకులు, మహిళా రైతులు, భూ నిర్వాసితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## ఢిల్లీ లాఠీ చార్జి కి నిరసనగా కారేపల్లిలో డివైఎఫ్ఐ ప్రదర్శన

**మోడీ హయాంలో భ్రష్టు పట్టిన విద్యారంగం - సీపీఐ(ఎం)**

**కారేపల్లి, మహా :** శాంతియుతంగా పార్లమెంటుకు లాంగ్ మార్చ్ చేస్తున్న విద్యార్థులు, నిరుద్యోగులపై మోడీ ప్రభుత్వం లాఠీఛార్జ్, నీటి ఫిరంగులు, భాష్ప వాయు ప్రయోగించడాన్నినిరసిస్తూ కారేపల్లిలో మంగళవారం ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కారేపల్లి బస్టాండ్ సెంటర్లో నిరసన సభను డివైఎఫ్ఐ మండల కార్యదర్శి ఆదేర్ల వినయ్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈసభలో సిపిఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కే.నరేంద్ర లు మాట్లాడుతూ దేశంలో విద్యారంగం అధ్వాన్న పరిస్థితులు నెలకొన్నాయన్నారు. జాతీయ పరీక్షల లీకేజీలకు కారణమైన కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని నెల రోజులుగా విద్యార్థులు, నిరుద్యోగులు, యువకులు పోరాటాలు నిర్వహిస్తున్నా మోడీ ప్రభుత్వం కనీసం స్పందించటం లేదన్నారు. మోడీ ప్రభుత్వ తీరును నిరసిస్తూ సామాజికవేత్త సోనం వాంగ్ చుక్ నిరాహార దీక్ష చేస్తున్నప్పటికీ సమస్యల పరిష్కారానికి ముందుకు రాకపోవటంతో యువత శాంతియుతంగా పార్లమెంట్ కు మార్చ్ పిలునిచ్చిందన్నారు. నిరసన తెల్పుతున్న విద్యార్థులపై లాఠీ చార్జ్, నీటి పిరంగులు, భాష్ప వాయు గోళాలు ప్రయోగించడం మోడీ ప్రభుత్వ నిరంకుశ తత్వానికి నిదర్శనమని విమర్శించారు. మోడీ అధికారంలోకి వచ్చిన 12 సంవత్సరాల కాలంలో 14 ప్రశ్నాపత్రాల లీకులు జరిగాయని దీంతో రూ.లక్షలు ఖర్చుపెట్టి కోచింగ్ తీసుకొని తర్ఫీదు పొందిన యువత సమయం,వయస్సు, వారి తల్లిదండ్రుల కష్టం వృధా అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షల లీకేజీలతో జీవితంపై భరోసా లేక అనేకమంది ప్రాణాలు తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేపర్ లీకుల దొంగలపై అరకొర చర్యలు తప్ప విద్య వ్యవస్థకు ప్రాతినిధ్యం వహిస్తున్న విద్యాశాఖ మంత్రి పై కనీసం చర్యలు తీసుకోకపోవడం మోడీ ప్రభుత్వ చిత్తశుద్ది శంకించాల్సి వస్తుందన్నారు. విద్యావ్యవస్థపై ప్రభుత్వ తీరుపై అసంతృప్తి తోటే పార్లమెంట్ మార్చ్ కు పూనుకోవాల్సి వచ్చిందన్నారు. ఇప్పటికైనా మోడీ ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను పరిష్కరించకపోతే దేశవ్యాప్త ఉద్యమంగా మారుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ,ఎస్ఎఫ్ఐ నాయకులు చిలుముల భరత్, కాకాటి పృధ్వి, వెంకీ,నవీన్ ప్రజానాట్యమండలి నాయకులు కరకపల్లి రాయమల్లు కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

# గోదావరి జలాలు అందించడమే లక్ష్యం

- **ఆయిల్ పామ్ సాగు రైతుల ఆర్థిక స్థిరత్వానికి బలమైన పునాది**
- **గిరిజన కుటుంబాల ఆదాయం పెరిగితేనే పిల్లల భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉంటుంది**
- **మరో 10 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు విస్తరిస్తే పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటు**
- **ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కోవాలంటే పంటల మార్పిడే ప్రత్యామ్నాయం**
- **ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి పొలంలో ఫామ్ పాండ్ నిర్మించుకోవాలి**
- **రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు గోదావరి జలాలు అందించడమే తన జీవిత లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ సహకార చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ములకలపల్లి మండలంలో మంగళవారం నిర్వహించిన ఆయిల్ పామ్ రైతుల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. గోదావరి జలాలతో పుష్కలంగా వ్యవసాయం చేసుకోవచ్చని తెలిపారు. ఆయిల్ పామ్ సాగు రైతుల ఆర్థిక స్థిరత్వానికి బలమైన పునాది అవుతుందని తెలిపారు. గిరిజన కుటుంబాల ఆదాయం పెరిగితేనే పిల్లల భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉంటుందని చెప్పారు. మరో 10 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు విస్తరిస్తే పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కోవాలంటే పంటల మార్పిడే ప్రత్యామ్నాయం అన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి పొలంలో ఫామ్ పాండ్ నిర్మించుకోవాలన్నారు.

గిరిజన ప్రాంతాల సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గిరిజనులకు రహదారులు తాగునీరు విద్యుత్ వైద్యం విద్య వంటి మౌలిక సదుపాయాలను కల్పించడంతో పాటు ప్రతి మండలంలో గురుకులాలు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. గిరిజన పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించి కలెక్టర్లు, ఉన్నతాధికారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. అడవుల విస్తీర్ణం తగ్గిపోవడంతో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని అడవి జంతువులు గ్రామాల్లోకి వస్తున్నాయని పేర్కొన్నారు. మర్రి వెదురు చింత వంటి స్థానిక జాతుల మొక్కలను విస్తృతంగా నాటి అడవులను పరిరక్షించాలని పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. సూపర్ ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో ఇప్పటికే 35 శాతం వర్షపాతం లోటు నమోదైందని భూగర్భ జలాలు కూడా తగ్గుముఖం పట్టాయని తెలిపారు. జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కూడా సాధారణం కంటే 20 నుంచి 30 శాతం వరకు తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున బోర్లపై ఆధారపడి వరి సాగు చేయకుండా తక్కువ నీటి అవసరం ఉన్న ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు.పెసర మినుము కంది అలసంద వంటి అపరాల సాగును విస్తరించాలని కోరారు. పత్తి సాగు చేసే రైతులు ప్రతి నాలుగు లేదా ఆరు వరుసలకు ఒక వరుస కందిని అంతర పంటగా సాగు చేస్తే అదనపు ఆదాయం లభించడంతో పాటు భూమి సారం పెరుగుతుందని తెలిపారు. ములకలపల్లి మండలంలో ప్రస్తుతం 8 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతోందని మరో 10 వేల ఎకరాల్లో సాగు విస్తరిస్తే వెంటనే పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తామని మంత్రి ప్రకటించారు. పోడు భూముల్లో విద్యుత్ సమస్యల పరిష్కారానికి సౌర విద్యుత్ సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయిల్ పామ్‌తో పాటు మునగ పప్పుధాన్యాలను అంతర పంటలుగా సాగు చేస్తే అదనపు ఆదాయం లభించడంతో పాటు భూమి సారం పెరుగుతుందని చెప్పారు. ప్రపంచ మార్కెట్లో మునగ ఆకుకు మంచి డిమాండ్ ఉన్నందున రైతులు ఆదాయాన్ని పెంచే పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగు రైతుల ఆర్థిక స్థిరత్వానికి బలమైన పునాదిగా నిలుస్తుందని అన్నారు. గిరిజన గ్రామాల్లో ప్రతి కుటుంబానికి సురక్షిత తాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. గిరిజన కుటుంబాల ఆదాయం పెరిగితేనే వారి పిల్లల భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉంటుందని చెప్పారు. గురుకులాలు ఏకలవ్య పాఠశాలల్లో అందుబాటులో ఉన్న విద్యా అవకాశాలను గిరిజన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టడం నేటి అవసరమని ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి రైతు తన పొలంలో ఫామ్ పాండ్ నిర్మించుకుని వర్షపు నీటిని నిల్వ చేసుకోవాలని సూచించారు. దీంతో భూగర్భ జలాలు పెరిగి భవిష్యత్తులో వ్యవసాయానికి ఉపయోగపడతాయని తెలిపారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను జిల్లాలోని అన్ని ప్రాంతాలకు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. యాతాలకుంట టన్నెల్ పనులు పూర్తయిన వెంటనే సీతారామ ప్రాజెక్టు ద్వారా చెరువులను నింపనున్నామని తెలిపారు. డిస్ట్రిబ్యూటరీ కాలువల నిర్మాణానికి రైతులు సహకరిస్తే పనులు వేగంగా పూర్తిచేసి ప్రతి రైతు పొలానికి గోదావరి జలాలు అందిస్తామని చెప్పారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు గోదావరి జలాలు అందించడమే తన జీవిత లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

**ఆయిల్ పామ్ సాగు ప్రథమ స్థానంలో ఉంది..**

రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రథమ స్థానంలో ఉందని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది వర్షపాతం గణనీయంగా తగ్గిందని సూపర్ ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ ఉద్యానవన నీటిపారుదల విద్యుత్ పశు సంవర్థక మిషన్ భగీరథ తదితర శాఖల సమన్వయంతో సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నామని తెలిపారు.జిల్లాలో ప్రస్తుతం 90 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతోందని ఈ ఏడాది కొత్తగా 15 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు లక్ష్యంగా నిర్దేశించామని తెలిపారు. వరికి బదులుగా మొక్కజొన్న మిర్చి ఆయిల్ పామ్ కూరగాయలు పప్పుధాన్యాలు వంటి తక్కువ నీటి అవసరం ఉన్న పంటల సాగును ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఆయిల్ పామ్ నాలుగో సంవత్సరం నుంచి దిగుబడిని ఇవ్వడం ప్రారంభించినప్పటికీ, సుమారు 30 సంవత్సరాల పాటు రైతులకు స్థిరమైన ఆదాయాన్ని అందించే పంటగా నిలుస్తుందని తెలిపారు. ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా మండల గ్రామ స్థాయిల్లో సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని కలెక్టర్ వివరించారు.అనంతరం ఆత్మనిర్భర్ మిషన్ అపరాల కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం కంది, మినుము విత్తనాలను 50 శాతం రాయితీపై అందిస్తున్నదని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి, జిల్లా కలెక్టర్ రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. రైతులు సమీప వ్యవసాయ అధికారులు లేదా వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు వివిధ శాఖల అధికారులు వ్యవసాయ ఉద్యానవన శాఖల అధికారులు ఆయిల్ పామ్ సంస్థ ప్రతినిధులు రైతులు పాల్గొన్నారు.

## ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్య

**మందమర్రి, మహా :** మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధి అందుగుల పేట నివాసి కొమ్ము రాజు (32) అనే యువకుడు వివాహం కావడం లేదని నేపంతో తన ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై గోపతి నరేష్ కథనం ప్రకారం మృతుడు రాజుకు చాలా సంబంధాలు చూసినా ఖాయం కాకపోవడంతో గత కొంతకాలంగా మనస్తాపంతో ఉంటున్నాడని తెలిపారు. తీవ్ర నిరాశకు గురైన రాజు మంగళవారం ఇంట్లో కుటుంబ సభ్యులు పనులకు వెళ్ళగా తాను ఇంట్లోకి వెళ్లి ఉరి వేసుకొని మృతి చెందాడని వెల్లడించారు. మృతుడు ప్రైవేట్ ట్రాక్టర్ డ్రైవర్ గా విధులు నిర్వహిస్తాడని వివరించారు. కాగా మృతుని సోదరుడు సాగర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

## పర్యావరణ పరిరక్షణలో ముందున్న సింగరేణి



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తిలోనే కాకుండా పర్యావరణ పరిరక్షణలో కూడా సింగరేణి దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్స్) ఎల్.వి.సూర్యనారాయణ, డైరక్టర్(ఈ అండ్‌ఎం)ఎం.తిరుమలరావు, జిఎం(సిపిపి) ఏ.మనోహర్ లు అన్నారు. మంగళవారం సింగరేణి వ్యాప్తంగా మహా వృక్షారోపణ కార్యక్రమం నిర్వహించిన దానిలో భాగంగా కొత్తగూడెంలోని ఇల్లందు బంగ్లాస్ ప్రాంగణంలో ప్రాంగణములో ఎన్విరాన్మెంట్ అండ్ ఫారెస్ట్ విభాగాల ఆధ్వర్యంలో మెగా ప్లాంటేషన్ డ్రైవ్(మహా వృక్షారోపణ కార్యక్రమం)ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా పాల్గొన్న వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా నిరంతరం మొక్కలను నాటుతూ వాటిని సంరక్షించే భాధ్యతను కూడా చెప్పట్టాలని సూచించారు. దేశంలో ఏ సంస్థ చేయని విధముగా ప్రతీ ఏడాది సింగరేణి సంస్థ నిర్దేశించుకున్నలక్ష్యం ప్రకారం మొక్కలను నాటుతూ మన సింగరేణి సంస్థ ముందు వరుసలో ఉన్నదని తెలిపారు. సింగరేణి సంస్థ దేశ ఇంధన అవసరాలను తీర్చడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తోందని విస్తృత స్థాయిలో హరితీకరణ గని ప్రాంతాల పునరుద్ధరణ నీటి సంరక్షణ పునరుత్పాదక ఇంధన వినియోగం కాలుష్య నియంత్రణ చర్యల ద్వారా సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు కట్టుబడి పనిచేస్తోందన్నారు. అనంతరం ఇల్లందు గెస్ట్ హౌస్ ప్రాంగణంలో 200 వివిధ రకాల పండ్ల మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో జిఎం(ఆర్ అండ్ డి)సిహెచ్.వెంకట రమణ, జిఎం(ఎస్టేట్) టి .లక్ష్మిపతి గౌడ్, జిఎం(సర్వే) ఎన్.రాఘవేంద్రరావు, జిఎం(ఎఫ్ అండ్‌ఏ) ఐఏ సిహెచ్.మురళీధర్, ఎన్విరాన్మెంట్ అండ్ ఫారెస్ట్ డిపార్ట్మెంట్ అధికారులు, ఇతర అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు.




## సీపీఐ(ఎం) నాయకులు ఎర్రబెల్లి లక్ష్మయ్య మృతి

**సమరశీల కమ్యూనిస్టు ఎర్రబెల్లి లక్ష్మయ్య - సీపీఎం**

**కారేపల్లి, మహా :** సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు కారేపల్లి మండలం గుంపెల్లగూడెంకు చెందిన ఎర్రబెల్లి లక్ష్మయ్య(60) మంగళవారం మృతి చెందారు. కొంత కాలం అనారోగ్యంతో బాధపడుతున్న లక్ష్మయ్య పరిస్థితి విషయమించటం మృతి చెందారు. ఆయన మృతదేహంలోపై సీపీఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్య వీరభద్రం, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మెరుగు సత్యనారాయణ, సీనియర్ నాయకులు తుమ్మోజు రాంమూర్తిలు సీపీఎం పతాకాన్ని కప్పి నివాళ్లు అర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం ప్రజా సమస్యలపై పోరాటాలకు నాయకత్వం వహించటంలో సమరశీలమైన కమ్యూనిస్టు ఎర్రబెల్లి లక్ష్మయ్య అని కొనియాడారు. మాదారం, గుంపెల్లగూడెం ప్రాంతాలలో పేదలకు ఇండ్లు, త్రాగునీటి సమస్య, కుల వివక్షతకు వ్యతిరేకం జరిగిన పోరాటంలో ముఖ్యభూమికి పోషించారన్నారు. గుంపెల్లగూడెం గ్రామాభివృద్ధిలో ఎర్రబెల్లి లక్ష్మయ్య పాత్ర మరవలేనిదన్నారు. నైతిక విలువలకు కట్టుబడి, ఎర్రజెండాను భుజాన మోసి కడవరకు ఎర్రజెండా నీడనే చేదతీరిన ఆదర్శ కమ్యూనిష్టు ఎర్రబెల్లి లక్ష్మయ్య అని అన్నారు. ఎర్రబెల్లి లక్ష్మయ్య ఆచరించిన సిద్ధాంతం, పోరాట స్పూర్తి అనుసరనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం)జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కే.నరేంద్ర, మండల కమిటీ సభ్యులు గుర్రం వెంకన్న, నాయకులు పాపినేని నాగేశ్వరరావు, గుంపెల్లగూడెం శాఖ కార్యదర్శి లక్ష్మయ్య చిన్న కుమారుడు ఎర్రబెల్లి సతీష్, పెద్ద కుమారుడు రాము, నాయకులు పొట్లకాయల రమేష్, ప్రజానాట్యమండలి నాయకులు కరకపల్లి రాయమల్లు, భాగం వెంకటప్పారావు, వేములపల్లి రమణ, కళాకారుడు ఎర్రబెల్లి నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

# సమష్టిగా నిలబడి ఎల్‌నినోను ఎదుర్కొందాం..!

**రైతులు, ప్రజల రక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం**
**అన్ని శాఖలు మిషన్ మోడ్‌లో పనిచేయాలి**
**అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్**





**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని, రైతులు మరియు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో మిషన్ మోడ్‌లో పని చేయాలని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధ్యక్షతన ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రూపొందించిన ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికపై నిర్వహించిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సమీక్షా సమావేశంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, కాలే యాదయ్యతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ... సంభావ్య వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రతి శాఖ ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసి, కంటింజెన్సీ ప్లాన్‌లను పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించడం, అవసరమైన విత్తనాల సరఫరా, తాగునీటి ఏర్పాట్లు, పశువులకు మేత, ఉపాధి హామీ పనులు, నిరంతర విద్యుత్ సరఫరా, వైద్య సేవలు వంటి అంశాల్లో ఎలాంటి లోటు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. వరికి బదులుగా తక్కువ నీటితో సాగయ్యే పెసర, కంది, జొన్న, రాగులు వంటి పంటలను ప్రోత్సహించాలని, రైతులకు అవసరమైన ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను వెంటనే అందుబాటులో ఉంచాలని సూచించారు. పశువులకు పశు గ్రాసం కొరత తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, జిల్లాలో తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా జల వనరులను ప్రణాళికాబద్ధంగా వినియోగించాలని తెలిపారు. అవసరమైన చోట కొత్త బోర్లు తవ్వించడం, తాగునీటి బోర్లకు నిరంతర విద్యుత్ సరఫరా కల్పించడం, స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరించేలా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాలను నివారించడం సాధ్యం కాకపోయినా, ముందస్తు ప్రణాళికలు మరియు సమన్వయంతో వాటి ప్రభావాన్ని గణనీయంగా తగ్గించవచ్చని స్పీకర్ పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే అనావృష్టి పరిస్థితుల నుంచి ప్రజలను రక్షించడం జిల్లా యంత్రాంగం బాధ్యత అని, అన్ని శాఖలు సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు.ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ... తక్కువ వర్షపాతం పరిస్థితుల్లో రైతులు వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో సాగయ్యే పంటలు, ఉద్యాన పంటలు, పండ్ల తోటలు, పూల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. మండల స్థాయిలో వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. ముఖ్యంగా ఇబ్రహీంపట్నం, మహేశ్వరం ప్రాంతాల్లో వరి సాగు అధికంగా ఉండటంతో, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని రైతులకు తగిన సూచనలు అందించాలని అధికారులను ఆదేశించారు.

జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ... అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు కార్యాచరణ ప్రణాళికలను అమలు చేయాలని సూచించారు. తాగునీటి కొరత తలెత్తకుండా ప్రత్యామ్నాయ నీటి వనరులను సిద్ధం చేయాలని, గ్రామాలు, పట్టణాల్లో నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. వ్యవసాయ శాఖ రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించడంతో పాటు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని, ఉద్యానవన, పశుసంవర్ధక, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, మున్సిపల్, వైద్య ఆరోగ్య శాఖలు తమ తమ కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసి వెంటనే అమలు చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు అప్రమత్తంగా పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ శాఖల యాక్షన్ ప్లాన్‌లు, కంటింజెన్సీ ప్రణాళికలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం తెలంగాణ జలసిరి పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా స్పెషల్ ఆఫీసర్లు సవ్యసాచి, వికాస్ రాజ్, మనోహర్ రెడ్డి, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి, శాసన మండలి సభ్యులు దయానంద్, జిల్లా అదనపు కలెక్టర్లు కె. కిరణ్మయి, చంద్రారెడ్డి, డీఆర్ఓ శారద, మున్సిపల్ చైర్మన్లు, ఆర్డీఓలు, వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, మున్సిపల్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య, భూగర్భ జలాలు, నీటిపారుదల తదితర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విప్ వేముల వీరేశం కు మంత్రి హోదా

**ఉత్తర్వులు జారీ**

**భువనగిరి జూలై 21 మహా న్యూస్ :** ప్రభుత్వ విప్ నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశంకు రాష్ట్ర ప్రభుత్వం మంత్రి హోదా కల్పిస్తూ మంగళవారం ఉత్తర్వుల జారీ చేయడం జరిగింది మంత్రి హోదా. కల్పించడం పట్ల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఉద్యమకారులు అభిమానులు హర్షం వ్యక్తం చేశారు



# ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఓటును కాపాడుకోవాలి

- **ఓటరు జాబితాల విషయంలో బిజెపి అనుసరిస్తున్న విధానం ఆందోళనకరం**
- **మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి**

**వరంగల్, మహా :** వరంగల్ తూర్పు నియోజకవర్గం లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు, అబ్జర్వర్ శంకర్ నాయక్ , పార్లమెంట్ ఇంచార్జ్ నసీర్ అహ్మద్ తో కలిసి వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని 18, 27, 36, 37, 38 డివిజన్లలో ఇన్చార్జీ లు నిర్వహిస్తున్న పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు బూత్ ఇన్చార్జీలతో మాట్లాడి, ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకొని, ప్రక్రియను మరింత వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని సూచించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి మాట్లాడుతూ పార్టీ అప్పగించిన బాధ్యతలను ప్రతి ఇన్చార్జి అంకితభావం తో నిర్వహించాలని, ప్రతి అర్హుడికి న్యాయం జరిగేలా ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి అర్హత కలిగిన ఓటరు ఎన్యుమరేషన్ ఫారాన్ని నింపి గడువులోగా సమర్పించాలని, ఓటరు జాబితాలో జాబితాలో పేరు, వివరాలు సక్రమంగా నమోదయ్యేలా ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని కోరారు. బూత్ ఏజెంట్ లు అందుబాటులో ఉంటూ అవసరమైన 'సహాయ సహకారాలు అందించాలని సూచించారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తల పాత్ర ఎంతో కీలకమని పేర్కొంటూ, ప్రతి ఇన్చార్జి సమన్వయంతో పనిచేసి జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను ఆదర్శంగా నిలపాలని ఆకాంక్షించారు. దేశంలో ఓటర్ల జాబితాలను రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించే ధోరణి ప్రజాస్వామ్యానికే ప్రమాదకరమని అన్నారు. ముఖ్యంగా బీజేపీ ఓటర్ల జాబితాల విషయంలో అనుసరిస్తున్న విధానం ఆందోళన కలిగిస్తోందని విమర్శించారు. ప్రజల మద్దతుతో గెలవలేని పరిస్థితుల్లో ఓటర్ల జాబితాల్లో మార్పుల ద్వారా రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఓటు హక్కు అనేది ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కు అని అది ఎలాంటి కారణాల తోనూ కోల్పోకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని ఓటు చోరీ ప్రయత్నాల పై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి బూత్ అధ్యక్షుడు, ప్రతి బిఎల్ఎ, ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ఓటు హక్కు పరిరక్షణ కోసం క్షేత్రస్థాయిలో పనిచేయాలి ఎన్నికల సమయంలో మాత్రమే కాకుండా, ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియ జరుగుతున్న ప్రతి దశలోనూ అప్రమత్తత అవసరమని ఇప్పటివరకు ఓటు వేసిన వారికీ కూడా భవిష్యత్తులో జాబితాలో పేరు లేకపోయే పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరించారు.

ప్రతి బూత్‌లో కాంగ్రెస్ కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తే పార్టీ విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని పేర్కొన్నారు, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరవేయడంతో పాటు, పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు వివరించే బాధ్యత కూడా బూత్ ఏజెంట్ల పై ఉందని తెలిపారు.



# సర్ ప్రక్రియలో కాంగ్రెస్ శ్రేణులు చురుకుగా పనిచేయాలి

**మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి**

**కుషాయిగూడ , మహా :** సర్ (ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ) ప్రక్రియ సాఫీగా, వేగవంతంగా సాగేలా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యతతో పనిచేయాలని ఉప్పల్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఉప్పల్ కచ్చిర్ స్కూల్ వద్ద కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఈగ ఆంజనేయులు ముదిరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్ సహాయ కేంద్రాన్ని మంగళవారం రజిత పరమేశ్వర్ రెడ్డి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిజమైన ఓటర్లకు సర్ ప్రక్రియ వల్ల ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అన్నారు. బీఎల్ఓలతో సమన్వయం చేసుకుంటూ ఓటర్లకు అవసరమైన సేవలు అందించాలని కార్యకర్తలకు సూచించారు. సహాయ కేంద్రాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తూ, అర్హులైన ఓటర్ల వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఈగ ఆంజనేయులు ముదిరాజ్, బజారు జగన్నాథ్ గౌడ్, తుమ్మల దేవి రెడ్డి, సల్లా ప్రభాకర్ రెడ్డి, మంద మురళీకృష్ణ రెడ్డి, మాశెట్టి రాఘవేందర్, భూత్కూరి మదన్ గౌడ్, కన్నమైన నరేష్, భాస్కర్ రెడ్డి, గోరిగ మహేష్, అలుగుల అనిల్, బచ్చా రాము, రాంరెడ్డి, రంగుల శేఖర్, ముదిగొండ రవి, ప్రశాంత్ రెడ్డి, మినంపల్లి కిషోర్, చంద్రశేఖర్ రెడ్డి, విజయ్, ఆసిఫ్, బట్కిరి కుమార్, తైసిన్, మోసిన్, అతిఫ్, వహీద్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రీ సర్వే పారదర్శకంగా నిర్వహించాలి

**యాదాద్రి భువనగిరి జూలై 21 మహా :** రీసర్వే ప్రాజెక్టును పారదర్శకంగా, సమర్థవంతంగా అమలు చేయాలని యాదాద్రి భువనగిరి రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి తెలిపారు.మంగళవారం భువనగిరి జిల్లా కలెక్టరేట్ మినీ మీటింగ్ హాల్ లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అధ్యక్షతన, భువనగిరి రెవెన్యూ డివిజనల్ అధికారి జయమ్మ, రెవిన్యూ డివిజనల్ అధికారుల సమక్షంలో రీసర్వే ప్రాజెక్టుపై అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రెవిన్యూ అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక కార్యక్రమమైన రీసర్వే ప్రాజెక్టును సమర్థవంతంగా, పారదర్శకంగా, నిర్ణీత కాలపట్టిక ప్రకారం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ క్షేత్రస్థాయిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రీసర్వే ప్రక్రియలో నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ ప్రతి దశను బాధ్యతాయుతంగా నిర్వహించాలని తెలిపారు.సమావేశంలో రీసర్వే కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయడానికి అవసరమైన కార్యాచరణపై విస్తృతంగా చర్చించి, సంబంధిత అధికారులకు మార్గదర్శకాలు అందజేశారు. ఈ సందర్భంగా సహాయ సంచాలకులు (సర్వే & భూ రికార్డులు) సుజాత , మండల సర్వేయర్ శ్రీదేవా రీసర్వే ప్రాజెక్టు లక్ష్యాలు, అవసరం, ప్రాముఖ్యత, అమలు విధానం, స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ), సంబంధిత ఫారాలు, నిబంధనలు, చట్టంలోని సెక్షన్లు, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై జిల్లాలోని తహసీల్దారులు, మండల సర్వేయర్లకు సవివరంగా అవగాహన కల్పించారు.రీసర్వే ప్రక్రియ అమలులో పాటించాల్సిన విధివిధానాలు, భూ రికార్డుల ఖచ్చితత్వం, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు చర్చించారు. సమావేశంలో అధికారులు తమ సందేహాలను వ్యక్తం చేయగా, వాటికి సహాయ సంచాలకులు (సర్వే & భూ రికార్డులు), మండల సర్వేయర్ సమగ్ర వివరణ అందించారుఈ సమావేశం లో మండలం తహసీల్దారులు, మండల సర్వేయర్లు, సంబంధిత రెవెన్యూ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.



# వర్షా భావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రత్యేక కార్యాచరణ

- **ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి**
- **మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**



**హన్మకొండ, మహా ;** రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో సాధారణం కంటే వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

మంగళవారం హనుమకొండ కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలసి ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, కంటింజెన్సీ ప్రణాళికల అమలు పై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు.

సమావేశంలో రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, తెలంగాణ శాసనసభ డిప్యూటి స్పీకర్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, దొంతి మాధవ రెడ్డి, కడియం శ్రీహరి, కె.ఆర్. నాగరాజు, డా. మురళి నాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాశ్, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి, రాష్ట్ర కళాశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన, ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్లు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

***ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ..**

ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వర్షాభావ ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, కంటింజెన్సీ ప్రణాళికలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

వర్షాభావ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రతి ఉమ్మడి జిల్లాకు ప్రత్యేక అధికారులను నియమించగా, ఉమ్మడి వరంగల్ జిల్లాకు సీనియర్ ఐఏఎస్ అధికారి దేవసేనను నియమించినట్లు తెలిపారు. వ్యవసాయం, తాగునీటి లభ్యత, భూగర్భ జలాలు, వర్షాభావ పరిస్థితులపై ప్రత్యేక అధికారులు నివేదికలు సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తారని చెప్పారు. సమగ్ర నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపించి అవసరమైన సహాయం కోరనున్నట్లు వెల్లడించారు.ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు వరి, పత్తికి ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో సాగు చేయగల పంటల పై వ్యవసాయ అధికారులు రైతులకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలని మంత్రి ఆదేశించారు. కోతుల బెడద నివారణ చర్యలపైనా రైతులకు సూచనలు ఇవ్వాలని అన్నారు.

దేవాదుల ప్రాజెక్టు మోటార్లు ప్రతిరోజూ పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, ఏదైనా లోపం తలెత్తితే 24 గంటల్లో మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. దేవాదుల ద్వారా తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైన నిధులను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. దేవాదుల, సాగునీటిపారుదల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఈ సమన్వయాన్ని ములుగు జిల్లా కలెక్టర్ పర్యవేక్షించాలని సూచించారు.

**ఆందోళన వద్దు ప్రభుత్వ అండగా ఉంది**

ప్రజలు, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పరిస్థితిని ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన అన్ని చర్యలు చేపడుతుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

**వరికి ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులను సన్నద్ధం చేయాలి**
**మంత్రి పొన్నం ప్రభాకర్**

ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వరి పంటకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను సన్నద్ధం చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా లెమన్ గ్రాస్ వంటి ఆదాయాన్ని అందించే ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని తెలిపారు.వర్షాభావ పరిస్థితుల్లో పశుసంవర్ధక రంగానికి కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, పశువులకు తాగునీరు, పశుగ్రాసం కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, భూగర్భ జలాల పరిస్థితి, తాగునీటి అవసరాలకు సరిపడా నీటి లభ్యతపై వెంటనే సమగ్ర నివేదికలు సిద్ధం చేసి అందించాలని సూచించారు.వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పై స్థాయి అధికారుల నుంచి సిబ్బంది వరకు అందరూ సమన్వయంతో పనిచేయాలని, ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టడం ద్వారానే ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడగలమని మంత్రి అన్నారు.

ప్రస్తుతం అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగిస్తూ, రైతులు, అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సామాజిక బాధ్యతతో పనిచేస్తే వర్షాభావ పరిస్థితులను విజయవంతంగా అధిగమించవచ్చని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.



## ఏఐటీయుసీ జిల్లా నాలుగవ మహాసభల గోడపత్రికను ఆవిష్కరణ

**జిల్లా కార్యదర్శి పానుగంటి పర్వతాలు..**

**రాజేంద్రనగర్ మహా ;** ఏఐటియుసి రంగారెడ్డి జిల్లా నాలుగో మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి పానుగంటి పర్వతాలు కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. శంషాబాద్ పరిధిలోని ప్రైవేటు హోటల్లో ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా నాలుగో మహాసభల గోడపత్రికను మంగళవారం ఏఐటీయూసీ నాయకులతో కలిసి ఏఐటియుసి జిల్లా కార్యదర్శి పానుగంటి పర్వతాలు ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి పర్వతాలు మాట్లాడుతూ ఏఐటియుసి రంగారెడ్డి జిల్లా నాలుగో మహాసభలను జిల్లా పరిధిలో ని తుక్కుగూడలో జరుగుతాయన్నారు. రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏఐటియుసి నాయకత్వంలో అనేక పోరాటాలు చేస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బరితెగించి ధరలు పెంచి కార్మికుల బతుకులు ఆగం చేస్తున్నాయి. కార్మికులకు కనీస వేతనాలు 26000 వేలు ఇవ్వాలి. ఈఎస్ఐ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రామస్వామి, జిల్లా ఉపప్రధాన కార్యదర్శి దత్తు నాయక్, మున్సిపల్ సంఘం రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి, నాయకులు సత్యనారాయణ,చందు యాదవ్, వెంకటస్వామి, సక్రు నాయక్, నర్రా గిరి, మంజుల రాములు తదితరులు పాల్గొన్నారు.

## సుదర్శన పెరుమాళ్ తిరునక్షత్ర మహోత్సవం...

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ మండలంశ్రీరామ్ నగర్ లోని సమతా మూర్తి కేంద్రంలో శ్రీ త్రిదండి చిన్న రామానుజ జీయర్ స్వామి పర్యవేక్షణలో శ్రీ సుదర్శన పెరుమాళ్ తిరునక్షత్ర మహోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. విశ్వశాంతిని, లోకక్షేమాన్ని అకాంక్షిస్తూ నిర్వహించిన ఈ వేడుకల్లో భాగంగా సమతా మూర్తి కేంద్రంలో శ్రీ సుదర్శన మహా మంత్ర రుత్విక్కుల వేద మంత్రోచ్చారణల నడుమ విశేష పూజలు, పూర్ణాహుతి, మంగళాశాసనం, వేద ఆశీర్వచనం కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. అనంతరం భక్తులందరికీ తీర్థ, ప్రసాదలు స్వీకరించారు. ఈ సుదర్శన జయంతి ఉత్సవాన్ని కళ్లారా తిలకించి, భగవంతుని కృపకు పాత్రులయ్యారు. హైదరాబాద్ నగర నలుమూలల నుండి భక్తులు విశేష సంఖ్యలో సమతామూర్తి ప్రాంగణమంతా భక్తిపారవశ్యంతో మునిగి పోయింది. భక్తుల గోవింద నామస్మరణలతో సమతా మూర్తి క్షేత్రం మారుమోగింది.



# వాన దేవుడా కరుణించు

- సకాలంలో వర్షా లు కురిపించు
- దమ్మాయిగూడలో 1001 బిందెలతో శత కలశాభిషేకం
- వర్షా ల కోసం ప్రత్యేక ప్రార్థనలు. బతుకమ్మ ఆటపాటలు

**కుషాయిగూడ, మహా:** వానలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో సకాలంలో వర్షాలు కురిపించాలని కోరుతూ దమ్మాయిగూడలోని సీతారామ శివాంజనేయ స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలు, భక్తులు కలిసి 1001 బిందెల నీటితో స్వామివారికి, గ్రామదేవత బొడ్రాయికి శత కలశాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో బతుకమ్మ ఆటలు, భక్తి గీతాలతో కార్యక్రమాన్ని ప్రారంభించిన భక్తులు అనంతరం శివుడికి, గ్రామదేవత బొడ్రాయికి అభిషేకాలు చేశారు. తెలంగాణ ప్రజలతో పాటు హైదరాబాద్ నగర ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని, నీటి ఎద్దడి తొలగి సకాలంలో వర్షాలు కురవాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇటీవల రెండు నెలలుగా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో బోర్లు ఎండిపోతున్నాయని, తాగునీటి సమస్య రోజురోజుకూ తీవ్రంగా మారుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. నగర ప్రాంతాల్లో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతుండగా, గ్రామీణ ప్రాంతాల్లో రైతులు పంటల సాగు ప్రారంభించలేక ఆందోళన చెందుతున్నారని తెలిపారు.వర్షాభావంతో అనేక ప్రాంతాలు ఎడారిని తలపిస్తున్నాయని, ఇప్పటికైనా వానదేవుడు కరుణించి సమృద్ధిగా వర్షాలు కురిపించాలని భక్తులు ప్రార్థించారు. ఓ వాన దేవుడా. మా దాహార్తిని తీర్చి, తెలంగాణ నేలను పచ్చగా మార్చు అంటూ భక్తులు వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మాజీ వార్డ్ నెంబర్ సంపన్న బోయిన శ్రీహరి గౌడ్ మాజీ వార్డ్ కౌన్సిలర్ శ్రీహరి గౌడ్ దమ్మైగూడ కు చెందిన మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బతుకమ్మ ఆటతో ఆలయ ప్రాంగణమంతా బతుకమ్మ ఆటపాటలతో దద్దరిల్లింది వర్షాలు సకాలంలో పడకపోవడం వల్ల ఆయా కాలనీలలో వాటర్ సమస్య అధికంగానే ఉంది ఇప్పటికే అనేక కాలనీలలో వాటర్ లేక నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు వర్షాలు పడాలి అందరూ బతకాలే వాన దేవుడా మా యందు కరుణించు అంటూ ఆ భగవంతుడిని వేడుకున్నారు

# ఢిల్లీ జంతర్ మంతర్ లో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్ అమానుషం

- **తీవ్రంగా ఖండించిన ఎం సి పి ఐ యు పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్**



**బెల్లంపల్లి, మహా:** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యా వ్యవస్థలో జవాబుదారీతనం, పరీక్షల నిర్వహణలో పారదర్శకత కోరుతూ విద్యార్థులకు న్యాయం చేయాలని గత 20 రోజులుగా శాంతియుతంగా ఆందోళన కొనసాగిస్తున్న వారిపై లాఠీచార్జి చేయడం అమానుషమని, కేంద్ర విద్యాశాఖ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని ఎంసీపిఐ యు పార్టీ మంచిర్యాల జిల్లా సహాయ కార్యదర్శి పసిలేటి వెంకటేష్ డిమాండ్ చేశారు. మంగళవారం నాడు పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఢిల్లీ జంతర్ మంతర్ నుండి నిర్వహించిన "చలో పార్లమెంట్" కార్యక్రమంలో పాల్గొన్న వేలాది మంది విద్యార్థులు, యువతపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం, బాష్పవాయు గోళాలు ప్రయోగించడం, విచక్షణారహితంగా భౌతిక దాడులకు పాల్పడడం అత్యంత హేయమైన, ప్రజాస్వామ్య వ్యతిరేక చర్య అని అభివర్ణించారు. తమ పార్టీ సైతం తీవ్రంగా ఖండిస్తోందని,విద్యార్థులు లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉండగా కేంద్ర ప్రభుత్వం నిరసనలను అణచివేయడానికి బలప్రయోగాన్ని ఆశ్రయించడం అత్యంత దురదృష్టకరం అని ,ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధ హక్కు. ఆ హక్కును లాఠీలతో, బాష్పవాయు గోళాలతో అణచివేయాలని ప్రయత్నించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం అని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితికి కేంద్ర ప్రభుత్వ వైఖరే ప్రధాన కారణమని,ఆందోళన ప్రారంభ దశలోనే విద్యార్థి ప్రతినిధులతో చర్చలు జరిపి వారి డిమాండ్లపై స్పందించి ఉండి ఉంటే పరిస్థితి ఇంతవరకు వచ్చేది కాదు అని,సమస్యను సంభాషణ ద్వారా పరిష్కరించాల్సిన చోట బలప్రయోగం ద్వారా ఎదుర్కోవడం కేంద్ర ప్రభుత్వ పరిపాలనా వైఫల్యాన్ని ప్రతిబింబిస్తోందన్నారు. విద్యార్థులపై దాడి చేసిన బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమం లో పార్టీ బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆరెపల్లి రమేష్,, ఆరెపల్లి సతీష్ వంశీ తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా ఎమ్మెల్యే నాయిని జన్మదిన వేడుకలు

- **కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపిన మంత్రులు, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు**

**హన్మకొండ, మహా;** హనుమకొండ జిల్లా కలెక్టరేట్ సమీపంలోని తహసీల్దార్ కార్యాలయంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తో కేక్ కట్ చేయించి, శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ వేడుకల్లో శాసన మండలి సభ్యులు బస్వరాజు సారయ్య , శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, గండ్ర సత్యనారాయణ రావు , డాక్టర్ రామచంద్ర నాయక్, డాక్టర్ మురళి నాయక్, కేఆర్ నాగరాజు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



## తల్లి ప్రేమ ఎక్కడ?

**తెల్లటి సంచిలో పసికందు.. రోడ్డుపై కలకలం**

**రాజేంద్రనగర్, మహా :** శంషాబాద్ ఆర్జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎయిర్‌పోర్ట్ కాలనీ ఓఆర్ఆర్ రోడ్డు పక్కన తెల్లటి సంచిలో నవజాత ఆడశిశువు కనిపించడం కలకలం రేపింది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై ఇంద్రసేనా రెడ్డి సిబ్బందితో కలిసి ఘటనాస్థలికి చేరుకున్నారు.శిశువును వెంటనే శంషాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన సంరక్షణ కోసం అమీర్‌పేటలోని శిశువిహార్‌కు పంపించారు. పాప పుట్టి ఒకటి లేదా రెండు రోజులు మాత్రమే అయ్యి ఉండొచ్చని వైద్యులు తెలిపారు.నవజాత శిశువును రోడ్డుపై వదిలేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పాపకు సంబంధించిన సమాచారం ఉన్నవారు ఆర్జీఐఏ పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు.




## అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్ట్...

**రాజేంద్రనగర్ మహా ;** అత్తాపూర్ పోలీసులు, రాజేంద్రనగర్ ఎస్‌వోటీ బృందంతో కలిసి పోలీసులు సోమవారం అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడుతున్న ఆరుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.పోలీసుల దర్యాప్తులో ప్రధాన నిందితుడు మహమ్మద్ ఫైజాన్ బక్షి నాగ్‌పూర్ నుంచి గంజాయిని తెప్పించి, సబ్ ప్యాడలర్ సయ్యద్ సాదిక్ ద్వారా చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి నగరంలోని వివిధ ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు గుర్తించారు.నిందితుల వద్ద నుంచి 8.410 కిలోల ఎండు గంజాయి, టీజీ13ఈ8108 నంబర్ గల ఒక మోటార్‌సైకిల్, మూడు డిజిటల్ తూకం మిషన్లు, ఒక సీలింగ్ మిషన్, ప్యాకింగ్ మెటీరియల్, మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.అంతర్రాష్ట్ర స్థాయిలో కొనసాగుతున్న ఈ గంజాయి సరఫరా గొలుసుపై మరింత లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# పౌడర్ బ్లూ చీరలో ప్రణీత మెరుపులు



దక్షిణాది సినీ ప్రేక్షకులకు తన అందం, అభినయంతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న కథానాయిక ప్రణీత సుభాష్ మరోసారి తన స్టైలిష్ లుక్‌తో అందరి దృష్టిని ఆకర్షించింది. ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ గౌరవ్ గుప్తా రూపొందించిన అందమైన పౌడర్ బ్లూ రంగు చీరలో ఆమె మెరిసిపోయింది. వెండి రంగు సీక్విన్ వర్క్, సున్నితమైన ఎంబ్రాయిడరీతో అలంకరించిన ఈ చీరకు వన్ షోల్డర్ డిజైనర్ బ్లౌజ్ జత కావడంతో ఆమె లుక్ మరింత ఆకర్షణీయంగా మారింది.

వజ్రాభరణాలు, భారీ చెవిపోగులు, మృదువైన మేకప్, సింపుల్ హెయిర్‌స్టైల్‌తో ప్రణీత ఎంతో హుందాగా కనిపించింది. ఈ ఫొటోలను ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పంచుకుంటూ గౌరవ్ గుప్తా డిజైన్‌ను ప్రశంసించింది. ప్రస్తుతం ఈ చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారి అభిమానుల నుంచి భారీ స్పందన అందుకుంటున్నాయి. "అందానికి మరో పేరు ప్రణీత", "చీరలో మరింత అందంగా ఉన్నారు" అంటూ నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

1992 అక్టోబర్ 17న బెంగళూరులో జన్మించిన ప్రణీత సుభాష్, మోడల్‌గా తన కెరీర్‌ను ప్రారంభించి అనంతరం సినీ రంగంలో అడుగుపెట్టింది. 2010లో విడుదలైన కన్నడ చిత్రం 'పోర్కి' ద్వారా కథానాయికగా పరిచయమైంది. అదే ఏడాది వచ్చిన తెలుగు చిత్రం **'బావ'**తో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైంది. అనంతరం పవన్ కళ్యాణ్ సరసన నటించిన 'అత్తారింటికి దారేది' చిత్రం ఆమెకు భారీ గుర్తింపు తీసుకొచ్చింది.

తెలుగు, కన్నడ, తమిళ, హిందీ, మలయాళ భాషల్లో పలు విజయవంతమైన చిత్రాల్లో నటిస్తూ ప్రణీత తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకుంది. తమిళంలో 'మాస్', తెలుగులో 'హలో గురు ప్రేమ కోసమే', హిందీలో 'హంగామా 2', 'భుజ్: ది ప్రైడ్ ఆఫ్ ఇండియా' వంటి చిత్రాల్లో నటించి తన నటనతో ఆకట్టుకుంది.

ఇటీవల విడుదలైన 'థాంకమణి', 'రమణ అవతార' చిత్రాల్లోనూ ఆమె తన పాత్రలతో ప్రేక్షకులను అలరించింది. సహజమైన నటన, సొగసైన తెరప్రజెన్స్, గ్లామర్‌కు ప్రాధాన్యం ఇచ్చే ప్రణీత సుభాష్ ప్రస్తుతం కూడా బహుభాషా కథానాయికగా తన విజయయాత్రను కొనసాగిస్తోంది. సోషల్ మీడియాలోనూ ఆమెకు భారీ ఫాలోయింగ్ ఉండగా, ప్రతి కొత్త ఫొటోషూట్ అభిమానుల్లో ప్రత్యేక ఆసక్తిని కలిగిస్తోంది.



# విజయ్ చివరి సినిమా.. భారీ అంచనాలు

కోలీవుడ్ స్టార్ హీరో, తమిళనాడు ముఖ్యమంత్రి తలపతి విజయ్ నటుడిగా వీడ్కోలు పలుకుతున్న చిత్రం 'జన నాయకన్' ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది. విజయ్ పూర్తిస్థాయిలో రాజకీయాల్లోకి అడుగుపెట్టే ముందు వస్తున్న చివరి సినిమా కావడంతో ఈ చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. జూలై 23న విడుదల కానున్న సందర్భంగా నిర్మాత వెంకట్ కె. నారాయణ పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. కరోనా తర్వాత సినీ నిర్మాణ రంగంలోకి రావాలని నిర్ణయించుకున్న తాను, తొలి సినిమానే భారీ స్థాయిలో ఉండాలని భావించానని చెప్పారు. అదే ఆలోచనతో విజయ్‌ను సంప్రదించగా, ఆయన కెరీర్‌లో చిరస్థాయిగా నిలిచే సినిమాను రూపొందించాలనే లక్ష్యంతో 'జన నాయకన్' ప్రారంభమైందని తెలిపారు. మొదట ప్రకటించిన సమయానికే విడుదల చేయాలని భావించినప్పటికీ, సెన్సార్ ప్రక్రియల కారణంగా సినిమా దాదాపు ఏడు నెలలు ఆలస్యమైందన్నారు. అయితే ఆ సమయాన్ని సినిమాను మరింత మెరుగుపర్చేందుకు వినియోగించుకున్నామని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా 7,000 నుంచి 8,000 స్క్రీన్లలో ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి ఏర్పాట్లు చేసినట్లు నిర్మాత వెల్లడించారు. విజయ్ కెరీర్‌లోనే ఇది అతిపెద్ద విడుదలల్లో ఒకటిగా నిలుస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ చిత్రం కోసం 'భగవంత్ కేసరి' కథను ఆధారంగా తీసుకోవాలన్న ఆలోచన విజయ్ సూచనతోనే వచ్చిందని చెప్పారు. అయితే ఆ కథను యథాతథంగా కాకుండా, తమిళ ప్రేక్షకుల అభిరుచికి అనుగుణంగా పలు మార్పులు చేసి కొత్త అనుభూతిని కలిగించేలా రూపొందించామని వివరించారు. నిర్మాణ ప్రయాణంలో ఎదురైన ప్రతి సవాలు విలువైన అనుభవాన్ని అందించిందన్నారు. విజయ్ వ్యక్తిత్వం గురించి మాట్లాడుతూ ఆయన క్రమశిక్షణ, పనిపట్ల నిబద్ధత, అంకితభావం చిత్రబృందానికి ఎప్పుడూ స్ఫూర్తిగా నిలిచాయని పేర్కొన్నారు. దర్శకుడు హెచ్. వినోద్ మహిళా సాధికారతతో పాటు సమాజానికి అవసరమైన రాజకీయ మార్పు వంటి అంశాలను కథలో సమర్థంగా మేళవించారని తెలిపారు.

ప్రస్తుతం ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న విజయ్‌ను మరోసారి వెండితెరపై చూడటం ప్రేక్షకులకు ప్రత్యేక అనుభూతినిస్తుందని, అదే ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని నిర్మాత అభిప్రాయపడ్డారు. పూజా హెగ్డే, మమిత బైజు, బాబీ డియోల్ కీలక పాత్రలు పోషించిన 'జన నాయకన్' బాక్సాఫీస్ వద్ద కొత్త రికార్డులు సృష్టిస్తుందనే నమ్మకాన్ని ఆయన వ్యక్తం చేశారు




## 'రణబాలి' రిలీజ్ డేట్
# మారే ఛాన్స్!

విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా ముచ్చటగా మూడోసారి నటిస్తున్న చిత్రం 'రణబాలి'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. విజయ్‌కు చివరి విజయాన్ని అందించిన 'టాక్సీవాలా' దర్శకుడు రాహుల్ సాంకృత్యన్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తుండటంతో పాటు, హిట్ జోడీ మరోసారి కలిసి నటిస్తుండటంతో ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరిగింది. పీరియాడికల్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతున్న ఈ చిత్రం ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది. మొదట ఈ సినిమాను సెప్టెంబర్ 11న విడుదల చేస్తామని నిర్మాతలు ప్రకటించారు. అయితే మధ్యలో విజయ్ దేవరకొండ, రష్మిక వ్యక్తిగత కార్యక్రమాలతో పాటు షూటింగ్‌కు స్వల్ప విరామం రావడంతో నిర్ణయించిన తేదీకి సినిమా పూర్తి చేయడం కష్టమనే అభిప్రాయానికి చిత్రబృందం వచ్చినట్లు సమాచారం. దీంతో కొత్త విడుదల తేదీ కోసం నిర్మాతలు కసరత్తు ప్రారంభించారు. దసరా సీజన్‌ను లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ ఇప్పటికే అక్టోబర్ 2న 'ఆదర్శ కుటుంబం', అక్టోబర్ 15న 'జైలర్ 2' విడుదలలు ఖరారయ్యాయి. దసరా పండుగ అక్టోబర్ 20న ఉండటంతో అక్టోబర్ 16న 'రణబాలి'ని విడుదల చేసే అవకాశాలను మేకర్స్ పరిశీలిస్తున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. నవంబర్‌లో విడుదలకు ఖాళీ తేదీలు ఉన్నప్పటికీ అది అన్‌సీజన్ కావడంతో ఆ సమయంలో విడుదల చేయడానికి నిర్మాతలు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. ఇక డిసెంబర్ 3న 'ఫౌజీ', డిసెంబర్ 24న ఎన్‌బీకే109 విడుదలకు సిద్ధమవుతుండటంతో ఆ నెలలోనూ పోటీ తీవ్రంగా ఉండనుంది. ఈ పరిస్థితుల్లో దసరా సీజన్‌లోనే ప్రేక్షకుల ముందుకు రావడం 'రణబాలి'కి అనుకూలంగా ఉంటుందని చిత్రబృందం భావిస్తున్నట్లు సమాచారం. అయితే విడుదల తేదీపై ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు. త్వరలోనే కొత్త రిలీజ్ డేట్‌ను ప్రకటించే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి.




# 'శ్రీనివాస మంగాపురం'పై అజయ్ భూపతి ఆసక్తికర వ్యాఖ్యలు

సూపర్ స్టార్ కృష్ణ మనవడు, మహేష్ బాబు మేనల్లుడు జయకృష్ణ హీరోగా, బాలీవుడ్ నటి రవీనా టాండన్ కుమార్తె రషా థడానీ హీరోయిన్‌గా నటిస్తున్న చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. ఇందులో కలెక్షన్ కింగ్ మోహన్ బాబు 'వెంకటప్పయ్య నాయుడు' అనే కీలక పాత్రలో కనిపించనున్నారు. లవ్ అండ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన ఈ చిత్రం జూలై 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ఇంటర్వ్యూలో దర్శకుడు అజయ్ భూపతి చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

తాను ఎప్పుడూ ఒకే తరహా సినిమాలు చేయకుండా, ప్రతి చిత్రంలో కొత్తదనం చూపించాలని ప్రయత్నిస్తానని అజయ్ భూపతి తెలిపారు. 'ఆర్‌ఎక్స్ 100' తర్వాత అదే తరహా కథాంశాలతో అనేక చిత్రాలు వచ్చాయని, ఒక అమ్మాయి పాత్రను భిన్న కోణంలో చూపించిన విధానం ఇండస్ట్రీపై ప్రభావం చూపిందని అన్నారు. అదే తన సినిమాల ప్రభావానికి నిదర్శనమని పేర్కొన్నారు.

'మంగళవారం' సినిమా గురించి మాట్లాడుతూ, నింఫోమేనియాతో బాధపడే మహిళ పాత్రను భారతీయ నేపథ్యంలో మిస్టరీ థ్రిల్లర్‌గా చూపించడం పూర్తిగా కొత్త ప్రయత్నమని చెప్పారు. కథ మాత్రమే కాకుండా ఆ సినిమా మేకింగ్ స్టైల్ కూడా ప్రేక్షకులను ఆకట్టుకుందని, ఇప్పటికీ పలువురు దర్శకులు తమ చిత్రాలకు **'మంగళవారం'**ను రిఫరెన్స్‌గా తీసుకుంటున్నారని వెల్లడించారు.

ఇక 'శ్రీనివాస మంగాపురం' గురించి మాట్లాడుతూ.. ఇది కమర్షియల్ ఎలిమెంట్స్‌తో కూడిన ప్రేమకథ అని స్పష్టం చేశారు. "ఇది యాక్షన్ సినిమా కాదు.. ప్రేమ కోసం జరిగే యాక్షన్ ఉన్న లవ్ స్టోరీ" అని చెప్పారు. రస్టిక్ బ్యాక్‌డ్రాప్, సహజమైన పాత్రలు, నిజ జీవితానికి దగ్గరగా ఉండే సన్నివేశాలు ప్రేక్షకులను కథలో పూర్తిగా లీనమయ్యేలా చేస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

విజువల్ ట్రీట్‌మెంట్, పాత్రల తీరు ఎక్కడా కృత్రిమంగా అనిపించదని, సినిమా ప్రారంభమైన తొలి పది నిమిషాల్లోనే ప్రేక్షకులు కథలోకి వెళ్లిపోతారని అజయ్ భూపతి తెలిపారు. అలాగే ఈ చిత్రంలోని సంగీతం కూడా ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని, 'మంగళవారం' చిత్రానికి లభించిన మ్యూజిక్ రెస్పాన్స్ తరహాలోనే **'శ్రీనివాస మంగాపురం'**లోని పాటలు, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కూడా ప్రేక్షకులను అలరిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.






EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com